[illegible] పత్రిక

సంపుటం:

సంచిక:

విజయ సంవత్సరం — శ్రావణ భాద్రపదములు

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

కాకినాడ

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy)

చందా సంవత్సరమునకు మూఁడు రూపాయలు.

సంపుటము ౪౧ { విజయ సంవత్సరము / శ్రావణ భాద్రపదములు } సంచిక 3

తెలుఁగుల తేజు.

వద్దిపర్తి రాజారావు.

చ॥ సిరులకుఁ దానకంబు, కడుఁ జెల్వగు విద్దెల తావలంబు, పో
టరితనపుంగొటారు, వినడంబగు తేగవు టాటపట్టు, రా
చరికపుఁటిమ్మ, నేయెడను సాటియె లేని తెలుంగుఁదల్లి, నీ
మురిపెపు టడ్గుఁ దమ్ములకు మోడ్పులు, బిడ్డల ముద్దు గాంచుమా.

మ॥ కలిగెన్ రాష్ట్రము నేఁడు; నాంధ్రులకు భాగ్యం బిద్ది చేకూరెఁ గాఁ;
గల లే వాఁటివొ నేఁడు బండె, నదిగో కాన్పించెఁ బ్రాచీదిశా
దొలిభాగ్యంబుల వేగుఁజుక్క, పలికెన్ దొల్కోడి, మేల్కొవయా.
తెలుఁగున్నేల్గుల భారతావనిని నుద్దీపింపఁగాఁ జేయఁగన్.

సీ॥ సంస్కృత భాషతో సంబంధ మెఱుఁగంగ
నన్నయ్య శ్రీనాథు నెన్నుమోయి
తెలుఁగునుడుల తేటతీయ్యముఁ గనఁ దిక్క
యజ్వను దిమ్మన నడుగుమోయి
జిలిబిలిపలుకుల కులుకుందనం బెన్న
నెఱ్ఱన్నఁ బోతన్న నెన్నుమోయి
పాకంబునను బరిపాకంబు గనఁ జేమ
కూరను నలసానిఁ జేరుమోయి

కల్పనాపాటవంబును గాంచె నంది
తిమ్మనను బింగళిని జేకొమ్ము; తియ్యఁ
దియ్య నుడికారముల పసల్ దెలిసి కొనఁగ
దేశ భాషలఁ లెస్స యగు దెల్గుఁ గనుము.

సీ. ఒకనాఁడు నీసుతుల్ చకచక తేజాను
దిక్కులఁ బఱపి పెం పెక్కినారు
విద్దెల నొకనాఁడు ద్వీపంబులకును గొం
పోయి యజ్ఞత కుఱి వోసినారు
ఓడల సంవాళిల నుఱికించి సరుకుల
దేశదేశంబుల దింపినారు
మన్నీఁడులై రాచమర్యాదఁ బాటించి
నేల నాల్గుచెఱంగు లేలినారు
కళల నమరావతి మొదలు నెలవులందు
గిలకరించియు నిలు దిద్ది యలరినార
లెందఱుం గూడ నీసుతు లింతలైనఁ
డీసిపోలేదు జగతినిఁ దెల్గుఁదల్లి.

సీ॥ త్రాగిన పాలమర్యాద నిల్పుమ యని
తనయుని నని కన్నెఁ దల్లి యోర్తు
వెన్నిచ్చి వచ్చిన వీరుఁడవా యని
పసుపుముద్ద నొసంగె భార్య యోర్తు
పగతుల కెల్లను బ్రక్కలో బల్లెమై
ప్రజ బిడ్డలన నేలఁ బడఁతి, యోర్తు
నవరసంబులఁ గుల్కు సవతు లేని ప్రబంధ
మిచ్చి మించెను గవయిత్రి యోర్తు.
వీరమాతలు నీ సుతల్ వీరసతులు
కాకతీరిన రాజ్యాంగ కార్యచణలు
నతుల రస రమ్య కావ్య కళాఢ్య లగుదు
రాంధ్రిజనయిత్రి నీకు నీ వమ్మ సాటి.

ఆంధ్రవాఙ్మయారంభదశ

శ్రీ దివాకర్ల వెంకటావధానిగారు

ఆంధ్రశబ్ద మిప్పుడు జాతిభాషాదేశములు మూఁడింటికిని సూచకముగా వాడఁబడుచున్నది. ఆంధ్రజాతి, ఆంధ్రదేశము, ఆంధ్రభాష యనునవి మనము తఱచుగా వినుచున్నమాటలే. ఈ మూఁడింటిలో భాషాదేశములకన్న జాతియే ముందాంధ్రసంజ్ఞితమై యుండినట్లు గోచరించుచున్నది. ఋగ్వేదమునకు సంబంధించిన యైతరేయబ్రాహ్మణమున విశ్వామిత్రుఁడు తన యాజ్ఞ నుల్లంఘించిన కుమారుల నేఁబది మందిని పుళిందులు, శబరులు, పుండ్రులు, మూతిబులు, ఆంధ్రులు కండని శపించినట్లు కలదు. దీనిని బట్టి యా బ్రాహ్మణము రచింపఁబడుటకుఁ బూర్వమే యాంధ్రు లను నొక జాతివా రుండినట్లు తెల్లమగుచున్నది. మహాభారత రామాయణములందుఁ బాండ్య చోళ కేరళులతోఁ బాటాంధ్రులు కూడఁ బేర్కొనఁబడియున్నారు. మౌర్యచంద్రగుప్తుని యాస్థానమునకు గ్రీకు రాయబారిగా వచ్చిన మెగస్తనీసను డాంధ్రులు, బలవిషయమున మౌర్యుల తరువాత నెన్నఁదగినవారై యుండిరనియు, వారికిఁ బెక్కుగ్రామములును బ్రాకారావృతములైన ముప్పదినగరములు నుండెననియు, వారి రాజునకు 100000 పదాతుల తోడను, 2000 రౌతులతోడను, 1000 ఏనుఁగులతోడను గూడిన సైన్యముండెననియుఁ దెలిపియున్నాఁడు. అశోకుని శాసనములలో నాంధ్రులాతని రాజ్యములోనివారై యాతని ధర్మబోధ ననుసరించిరని చెప్పఁబడినది. అశోకుని యనంతరము వారొక గొప్ప సామ్రాజ్యమును స్థాపించి, శుంగకాణ్వవంశము లంతరించినపిమ్మట మగధనుగూడ నాక్రమించుకొని యచ్చటనుండియే పరిపాలనము సాగించియుండిరనుటకు నిదర్శనములున్నవి. వాయుమత్స్య విష్ణుభాగవతపురాణములు శాతవాహనులు సుమారు నాలుగున్నఱ శతాబ్దులకాలము సామ్రాజ్యము

పాలించిరని నుడువుచున్నవి. భాగవతహరివంశములు చాణూరుఁడను నాంధ్రమల్లునిఁ బేర్కొనియున్నవి. ప్లినీయను చరిత్రకారుఁడు (క్రీ. శ. 77) 'అందర' జాతిని బేర్కొని తద్బలసంపదను వర్ణించెను. శాతవాహనుల తరువాత నాంధ్రదేశభాగముల నేలిన యిక్ష్వాకులు, విష్ణుకుండినులు, శాలంకాయనులు మున్నగు వారందఱు నాంధ్రులే. ఈ విధముగఁ జారిత్రయుగమునకుఁ బూర్వమునుండియు నాంధ్రజాతి బలవత్తరమై ప్రసిద్ధికెక్కియుండెనని చెప్పవచ్చును.

ఆంధ్రశబ్దము దేశపరముగా వాడఁబడుట క్రీ. శ. మూఁడవ శతాబ్ది నడిమిభాగమునుండిమాత్రమే కానవచ్చుచున్నది. శాతవాహను లాంధ్రులయ్యు నేలొకో తాము పాలించిన దేశ మాంధ్రదేశమని యేశాసనమునందును దెల్పుకొని యుండలేదు. పల్లవయువరాజైన శివస్కంధవర్మ ధాన్యకటకమును దనతండ్రి ప్రతినిధిగాఁ బాలించుచుండిన యధికారి కాజ్ఞాపత్రముగాఁ జెక్కించిన మైదవోలు తామ్రశాసనమున "ఆంధపతీయోగామో విజీపఅమ్" అను మాటలు కానవచ్చుచున్నవి. ఇం దాంధ్రదేశ మాంధ్రపథమని పేర్కొనఁబడినది. క్రీ. శ. 340 వ సంవత్సరమున మల్లదేవ నందివర్మ వేయించిన దానశాసనములో నాంధ్రమండలశబ్దము గోచరించుచున్నది. వరాహమిహిరుని బృహత్సంహితయందును హ్యూయన్ త్సాంగు వ్రాఁతలందును నాంధ్రదేశము పేర్కొనఁబడియున్నది. క్రీ. శ. 6 వ శతాబ్ది నడిమిభాగమునకుఁ జెందిన హరహా, జవానుపూరు శాసనములం దాంధ్రపతి శబ్దముదాహరింపఁబడి యున్నది. క్రీ. శ. 1072 వ సంవత్సరమున యశఃకర్ణదేవునిచేఁ జెక్కింపఁబడిన ఖైరాతామ్రశాసనమున "ఆంధ్రాధీశమరంధ్రదోర్విలసిత"మ్మను మాటలో నాంధ్రదేశప్రశంస కానవచ్చుచున్నది. తరువాత నాంధ్రదేశమను మాట సుప్రసిద్ధమై పెక్కుశాసనములందును గ్రంథములందును గూడ వాడఁబడియున్నది. ఈరీతిగా నాంధ్రపదము మొదట జాతిపరముగాను పిమ్మట దేశపగముగాను ప్రచారమున కెక్కినట్లు గోచరించుచున్నది.

ఆంధ్రశబ్దమును భాషాపరముగా వాడిన మొదటివాఁడు నన్నయ భట్టే యని చెప్పవచ్చును. రాజరాజనరేంద్రుని నందంపూడిశాసనమున నతఁడు నారాయణభట్టును వర్ణించుచు "యస్సంస్కృత కర్ణాట ప్రాకృతపైశాచికాంధ్ర భాషాసు గవిరాజశేఖర ఇతిప్రథితః సుకవిత్వ విభవేన" యని వ్రాసియుండెను అంతకుఁ బూర్వ మాంధ్రభాషయను పదము నెవ్వరైన వాడియుండిరేమో తెలియదు. నన్నయభారతమును రాజరాజు తన్నుఁ "దెనుఁగున రచియింపు"మని కోరినట్లుగాఁ దెల్పియుండెను. భారతాశ్వాసాంత గద్యలలో నాంధ్రభారతమను పదము కనవచ్చుచున్నది. అందుచే నన్నయకాలమున నాంధ్రతెనుఁగు పదములు రెండును సమానార్థకముగా వాడఁబడుచుండెనని తెలియుచున్నది. తిక్కనయు నన్నయ నాంధ్రకవిత్వ విశారదుఁడని పేర్కొని హరిహరనాథుఁడు తన్నుగూర్చి "భారతమును నీవు తెనుఁగుభాషలో వినిర్మింపఁబూనుట పురుషార్థతరు పక్వఫల"మని చెప్పినట్లు వర్ణించెను. దీనిని బట్టికూడ నాంధ్రభాష, 'ఆంధ్రము' 'తెనుఁగు' అను రెండు పేర్లను నప్పుడు పరివారములో నుండినట్లు తెలియుచున్నది. బసవపురాణమునందుఁ దెనుఁగుభాష తెలుఁగను పేరుతోఁగూడ వ్యవహరింపఁబడినది. నన్నయ, యాంధ్రతెనుఁగుశబ్దములను రెండింటిని భాషాపరముగా వాడియుండెను. గాన నాతనికిఁ బూర్వమే యీ భాషకా పేరు లుండియుండునని యూహింపవచ్చును.

సాధారణముగా నే భాషకైనను దేశమును బట్టి పేరువచ్చుట సహజము, ఆంధ్రులీ దేశము నాక్రమించుకొనునప్పటి కిచ్చటిప్రజ లేదో యొక భాషను మాటాడుచుండిరనుకొనుటలో విప్రతిపత్తిలేదు. అదియే తెనుఁగు లేక తెలుఁగుభాష. ఆంధ్రుల పాలనము క్రిందికి వచ్చినతరువాత నీదేశ మాంధ్రదేశమయ్యెను. ఆంధ్రదేశమునందలి యీ తెనుఁగు భాషకుఁ దదనుగుణముగా నాంధ్రభాషయను నామ మేర్పడెను. ఆంధ్రులును దెనుఁగువారును గలసి యాంధ్రులైరనియు, నాంధ్రభాష మాత్ర

మట్లు రెండు భాషల కలయికచే నేర్పడినది కాదనియుఁ దెనుఁగే యాంధ్రు లీదేశము నాక్రమించుకొనిన పిమ్మట నాంధ్రమని పిలువఁ బడెననియు శ్రీకోరాడ రామకృష్ణయ్యగారు వేంకటేశ్వర ప్రాచ్య భాషాసంస్థాపత్రికలో వ్రాసియున్నారు.

మూలద్రావిడభాషనుండి తమిళమువలెఁ దెనుఁగుకూడ క్రీస్తు పూర్వమే విడివడి క్రమపరిణామమును బొందియుండుగా. క్రీ. శ. 7 వ శతాబ్దమునఁ దెలుఁగుభాషలో వ్రాయబడిన మొదటి శాసనము కాన వచ్చుచున్నది. అంతకుఁబూర్వ మట్టిభాషయే లేక యాశాసన మూకా లముననే హఠాత్తుగా రూపొందెనని చెప్పుట యుక్తియుక్తముగా నుండదు. అంతకుముం దెంతకాలమునుండి యా భాష వాడుకలో నుండెనో పరిశీలింపవలసియున్నది. క్రీ. శ. మొదటి శతాబ్దికిఁ జెందిన యమరావతీ స్తూపమునందలి యొక రాతిపలకపై 'నాగబు' అను మాట కానవచ్చుచున్నది. ఆ మాట వాక్యగతమై కాక ప్రత్యేక ముగా నున్నది. నాగశబ్దము సంస్కృతశబ్దమేయైనను దాని చివరఁగల 'బు' అను నక్షర మది తెనుఁగుభాషను సంబంధించినదే (తత్సమమే) యని స్పష్టముగాఁ దెల్పుచున్నది. ఈ 'బు' అను నక్షరమే తరువాత 'బు, మ్బు,' 'ము,' అను రూపములను జెంది చివరకు ప్రథమావిభక్త్యేక వచనమైనది. మనకుఁ దెలిసినంతవఱకు 'నాగబు' అనునదియే శాసనస్థ మైన మొదటి తెనుఁగు మాటగాఁ గానవచ్చుచున్నది. కొంచెమించు మించుగా నా కాలముననే చెందిన హాలుని సప్తశతిలో నచ్చటచ్చట 'అత్త, అమ్మ,' పొట్ట వంటి తెనుఁగుపదములు కలవని తజ్ఞులు చెప్పు చున్నారు. వీనిని బట్టి క్రీ. శ. ప్రథమశతాబ్దినాఁటికే తెలుఁగుభాష తల్లినుండి వేఱయి వ్యవహరింపఁబడెననుటలో నాక్షేపమేమియుఁ గాన రాదు.

శాతవాహనుల శాసనములన్నియుఁ బ్రాకృత భాషలోనున్నవి అప్పుడు రాజభాష ప్రాకృతమే. వారితరువాత నాంధ్ర దేశమును

పాలించినరాజులు వేయించిన శాసనములు కొన్ని సంస్కృతమునను కొన్ని ప్రాకృతమునను నున్నవి. ఈశాసనములలోఁ బ్రధానముగా వాడఁబడిన భాష తెలుఁగు కాకపోయినను దత్తములైన గ్రామముల పేర్లును, వాని కెల్లలైన గ్రామముల పేర్లును దెనుఁగు పదములుగానే గోచరించుచున్నవి. సామాన్య ప్రజలకుఁగూడఁ దెలియుటకై యాశాసనములందా గ్రామముల పేర్ల నప్పుడు వ్యవహారమున నుండిన నామములతోఁ బేర్కొని యుందురు. అప్పుడు తెనుఁగుభాష వ్యవహారములో లేనిచో నాగ్రామనామములట్లు తెలుఁగుపదములుగా వ్రాయఁబడుట కవకాశము లేదు. ఈవిషయమును బలపఱచు వృత్తాంత మొకటి బృహత్కథ ననుసరించి వ్రాయబడిన కథాసరిత్సాగరములోఁ గానవచ్చుచున్నది. ప్రతిష్ఠాన పురమునందలి సాతవాహన రాజు నాస్థానమునను దిన గుణాఢ్యుడను పండితుఁడు ప్రత్యర్థియగు శర్వవర్మ యాఱుమాసములలో రాజును సంస్కృత భాషాపారగుని జేయఁగలిగిన యెడలఁ దాను నాఁడు వ్యాప్తిలోనుండిన సంస్కృత ప్రాకృత దేశభాషలను వదలివేసెదనని ప్రతినచేసినట్లా వృత్తాంతము తెలుపుచున్నది. ఇందుఁ బేర్కొనఁ బడిన దేశి బహుశః అప్పటి సామాన్యజనుల వాడుక భాషయై యుండవచ్చుననియు, నదియే కాలక్రమమునఁ గొన్ని మార్పులు పొంది తెలుఁగు భాషగాఁ బరిణమించి యుండుననియుఁ జారిత్రజ్ఞులు తలంచుచున్నారు. సాతవాహనుని రాజధానియైన ప్రతిష్ఠాన పురము మహారాష్ట్ర దేశమున నుండుటచేఁ బై వృత్తాంతమునఁ బేర్కొనబడిన దేశి యప్పటి మహారాష్ట్రుల వ్యవహార భాషయే యైయుండును గాని తెనుఁగువారి వ్యవహార భాషయై యుండదని కొందఱి వాదము. ఈవాదమును మన మంగీకరించినను నప్పుడు తెనుఁగుకూడ దేశభాషగా నుండెననుట కాక్షేపము లేదు. ఏలయన మహారాష్ట్ర ప్రాంతముల మహారాష్ట్ర దేశ్యముండినట్లే తెనుఁగు దేశమునఁ దెనుగుదేశ్యము వాడుకలో నుండి యుండవచ్చును. లేనిచో నుత్తర శాతవాహనుల శాసనములలో గ్రా

మనామాదులు తెనుఁగు పేర్లతో వ్రాయఁబడియుండుటకుఁ గారణము కనబడదు. అందుచే క్రీ. శ. 1వ శతాబ్దికిఁ బూర్వమునుండియుఁ దెనుగేదో యొక రూపమున వాడుక లోనుండెనని నిస్సందేహముగాఁ జెప్ప వచ్చును.

చాళుక్య రాజు లాంధ్ర దేశమునకుఁ బాలకులుగా నేర్పడు కాలము వఱకును నాంధ్రరాజులైన శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్ఫలాయనులు, ఆనంద గోత్రికులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు మున్నగు వారును, నాంధ్రదేశము నందలి కొంత భాగమును పరిపాలించిన పల్లవులును, వేయించిన శాసనములన్నియుఁ బ్రాకృతముననో సంస్కృతముననో యున్నవి. అందచ్చటచ్చటఁ గానవచ్చు తెనుఁగు పదములు గ్రామనామాదులు మాత్రమే యగుటచేనవి భాషాచరిత్ర పరిశీలమున కుపకరించునే కాని యప్పటి వాఙ్మయ పరిస్థితిని గుర్తించుటకుఁ బనికి రావు. అందుఁగానవచ్చు వేపూరారు, విరిపఱ్ఱ, తన్ఱ్రికొన్ఱ (తాంటి కొంట) ఒంగోడు, చెంచెరువ, కంబురాంచెరువ, రేగొన్ఱమ్, పెఱుకు పఱ్ఱు, కుండూరు మున్నగు గ్రామనామములు కొంచె మించుమించుగా ఊరు, పఱ్ఱ చెరువు. కొండ మున్నగు పదములతో ముగియుచుండు నిప్పటి గ్రామనామముల వలెనే గోచరించుచున్నవి. ఈగ్రామనామములకే కొన్నిచోట్ల, 'చెంచెరువే' మున్నగు దాని యందువలె సంస్కృత విభక్తులు చేర్పబడుట కానవచ్చుచున్నది. ఈశాసనములందు దాతృప్రతిగ్రహీతల పేర్లు దాహరింపఁబడి యుండుటచే నప్పటియుత్తమ జాతివారియొక్కయు విద్యాధికుల యొక్కయు నామముల స్వభావము నూహించుట కవకాశము కలుగుచున్నది. దేవశర్మ, యజ్ఞశర్మ శివదత్త మున్నగు నామములు కేవల సంస్కృత నామములే. గొలశర్మ, కొట్టిశర్మ, మున్నగు నామములందుఁ బూర్వార్థము తెనుఁగు పదమువలెనే కానబడు చున్నది.

శాలంకాయన వంశమునకుఁజెందిన నందివర్మ పెదవేగి శాసనమునందలి (6, A. D.) చెఱ చెరువె, కంబురాన్ చెరువె అను పద

ములనుబట్టియు, విక్రమేంద్రవర్మ వేయించిన చిక్కుళ్ల (506) శాసనమునందలి విజయరాజ్య సంవత్సరంబుళ్ అను పదమును బట్టియు నప్పటికిఁ జాలకాలమునకుఁ బూర్వమే తెలుఁగుభాష ప్రచారమున నుండెనని చెప్పుటకు వీలగుచున్నది. మూల ద్రావిడ భాషయందలి కాదులైన పదములు కొన్ని తెలుఁగునఁ దాళవ్యీకరణమును జెంది చాదులుగాఁ గానవచ్చుచున్నవి. చెరువుశబ్దమట్టి వానిలో నొకటి. ఈశబ్దమితర ద్రావిడ భాషలలోనిప్పటికిని గాదిగానే కానఁబడుచున్నవి. విజయరాజ్యసంవత్సరంబుళ్ అనుపదము చిక్కుళ్లశాసనమున సంస్కృత వాక్య మధ్యమున గోచరించుటచే నాకాలమున వాడుకలో నుండిన తెనుఁగుభాషను బాగుగానెఱింగిన శాసన లేఖకుండు సంస్కృత విభక్తికి బదులుగా సంవత్సర శబ్దములకుఁ దెలుగు విభక్తి చేర్చిలిఖించి యుండునని పండితు లూహించుచున్నారు. అతం డేకారణముచే నటు లిఖించినను నప్పటికే సంవత్సరాది సంస్కృత శబ్దములను దెనుంగునఁ దెనుఁగు ప్రథమావిభక్తి బహువచన రూపముతో వాడు పరిస్థితియేర్పడెనని చెప్పవచ్చును. ఈపరిస్థితియుఁబైని పేర్కొనఁబడిన తాళవ్యీకరణమును జరుగుటకుఁ దెనుఁగుమూల ద్రావిడము నుండి విడివడిన పిమ్మటఁ జాలకాలముబట్టి యుండును. అందుచే దీనిని బట్టి తెనుఁగు శాసనముల కాలమునకుఁ బూర్వమే దేశమున వాడుకలో నుండెనని నిర్వివాదముగాఁ జెప్పవచ్చును. పల్లవరాజైన విష్ణుగోపశర్మ చూరదాన శాసనమున ముయ్యూర్ కూటువయను పదము కానవచ్చు చున్నది. మూఁడు, ఊరు, కూటువ అను మూఁడు తెనుఁగు శబ్దముల కలయికచే నేర్పడిన సమాసమిది. ఇట్లే మూయెలకూడువ, చెక్చెరువు, ఒన్కోడు కురువాడ మున్నగు సమాసము లితర శాసనములందు గోచరించుచున్నవి. ఈసమాసముల ఘటనము కూడ భాష యంతకుఁ బూర్వము చాలకాలమునుండి ప్రచారమున నుండెననుటకుఁ దార్కాణముగా నున్నది.

ఈ శాసనము లన్నింటిలో చణ్డవర్మ, నన్దివర్మ, వేఙ్గిపుర, చెన్చెరువు అను వానివలె ననుస్వారమునకు బదు లనునాసికమే వాడఁబడి

యున్నది. ద్రావిడభాషకు స్వంతమైన 'ఱ' కారమును, శకటరేఫమును వ్రాతలలో గోచరించుచున్నవి. విజయరాజ్య సంవత్సరంబుళ్ అను దానిని బట్టి ళ్ బహువచన సూచక ప్రత్యయముగా వాడఁబడుచుండె ననియు, నిప్పటి ఋ అను నక్షరమునకు బదులు బిందుపూర్వక బుకారము వాడఁబడుచుండెననియుఁ దెలియుచున్నది. క్రీ. శ. ఏడవ శతాబ్ది వఱకును గల తెలుఁగుభాషను గూర్చి యింతకంటె నెక్కువగా నేమి చెప్పుటకును నవకాశము లేదు. అప్పటి రాజుల యాస్థానములఁ దెలుఁగు కవిత వర్ధిల్లకపోవుటకును, వారు శాసనములనైనఁ దెలుఁగుభాషలో వ్రాయింపకపోవుటకును వారికా భాషపై నాదరము లేమియే కారణమై యుండును.

దేశీయులైన చాళుక్యు లాంధ్రదేశములను బాలింప నారంభించినదాది తెలుఁగునకు గౌరవప్రపత్తులు హెచ్చెను. వారు తమకుఁ బూర్వ్యముండిన రాజులవలెనే కొన్ని శాసనములను సంస్కృతములోఁ గూడ తెలియఁజేసినను గొన్నింటిని దెలుఁగుభాషలోనే వ్రాయించిరి. పులకేశి సోదరుఁడును దూర్పుచాళుక్యవంశమునకు స్థాపకుఁడునైన కుబ్జవిష్ణువర్ధనుఁడు క్రీ. శ. 624 నుండి వేంగీరాజ్యమును బరిపాలించెను. ఈతని కాలమునుండి నన్నయకాలము వఱకును దెలుఁగున వ్రాయింపఁబడిన శాసనములను గద్యశాసనములు, గద్యపద్యశాసనములు, పద్యశాసనములు అని మూఁడు విధములుగా విభజింపవచ్చును. గద్యశాసనములలో మొదటిది కుబ్జవిష్ణువర్ధనుని కుమారుఁడైన జయసింహవల్లభుని కాలమున వ్రాయింపఁబడిన విప్పర్ల శాసనము (641) పై రాజుచే వేయింపఁబడినవే. మఱి రెండు శాసనములును, పశ్చిమచాళుక్య విక్రమాదిత్యుని కాలమునకు (సుమారు 655) జెందిన నొక శాసనమును, చేజెర్ల కపోతేశ్వర దేవాలయ మండప స్తంభమునుండి రెండవ విష్ణువర్ధనుని కాలమునకుఁ జెందినదని యూహింపఁబడిన దొక శాసనమును గలవు.

వీని తరువాతఁ గనవచ్చు గద్యశాసనములలో మంగి దొగరాజు కాలమున వ్రాయింపఁబడిన (క్రీ॥శ॥ 630) లక్ష్మీపుర శాసనమును, క్రీ॥శ॥ 740 ప్రాంతమునాఁటి దని యూహింపఁబడుచున్న అహదనకర శాసనమును, కడపమండలములో లభించిన సత్యాదిత్యుని మాలెపాడు శాసనమును, మూఁడవ విజయాదిత్యునినాఁటి (క్రీ॥ శ॥ 850) దియు, మల్లికార్జున స్వామి యాలయమున లభించినదియు నగు ధర్మవరపు శాసనమును చాళుక్య భీముని కొరవి శాసనమును (క్రీ॥ శ॥ 9 వ శతాబ్దిచివర) ముఖ్యములైనవి. గద్య పద్య మిశ్రితములైన వానిలోఁ జాళుక్య భీమ మహారాజు ధర్మవరపు శాసనమును (849) పండరంగుని అద్దంకి శాసనమును (క్రీ॥శ॥ 850) పేర్కొనఁ దగినవి. యుద్ధమల్లుని బెజవాడ శాసనమును, కందుకూరి రామస్వామి దేవాలయమునఁ గట్టఁబడిన మూఁడవ విజయాదిత్యుని కాలపు శాసనమును కేవల పద్యమయములైనట్టివి.

ఈ పై శాసనము లన్నింటిలోను; ఎఱుంబోది, అన్నేటి నాకుబణి సేసిన, మూఁటికి, చెరువు, ఘట్టు, తూమ్ము, తోఁటతోంట, ఇచ్చిరి, పడు వారంబు, వ్రిచ్చినవారు, నేల, కళరేని, చఱ్పిన, వేఁపురు, ఇచ్చిన, ఊరు, మున్నగు దేశ్యపదములు విరివిగానే కనవచ్చుచున్నవి. కాని క్రీ. శ. 9వ శతాబ్దికిఁ బూర్వము వ్రాయఁబడిన గద్య శాసనములలోఁ బ్రాకృత భాషా ప్రభావ మెక్కువగాఁ గానఁబడుచున్నది. అహదనకర శాసనములోనిది మఱియు నెక్కువగా నున్నది. ళకారాంత బహువచన రూపములును (కనడి రజుళ్, కొణ్డుకళ్) దొగ, ప్రితయు, వారణాసి, సవ్వలోకాశ్రియ మహా సత్థవళ్, సర్వబాదపరియారువు మున్నగు రూపములును నిందుకు నిదర్శనము. ఈ ప్రాకృత భాషాపద బాహుళ్యముచేతనే పూర్వశాసనములు కొంతవఱకు దురవగాహములుగాఁ గానిపించును. తరువాత వ్రాయఁబడిన గద్య పద్య మిశ్రితములును, కేవల పద్య రచితములు నైన శాసనములలోఁ బ్రాకృతప్రభావముకంటె సంస్కృత ప్రభావమే హెచ్చుగా గోచరించును. వాని యందలి దీర్ఘ

సమానములు కొన్ని నన్నయ కాలపు భాషను దలఁపించుచున్నవి. కొఱవి శాసనము లందలి వచనమునకును, బాపట్ల గణేశ్వరస్వామి యాలయములోని యాహవ మల్ల దేవుని కాలమునకుఁ జెందిన శాసనము నందలి వచనమునకును భేద మంతగా లేదనియే చెప్పవచ్చును. దీనిని బట్టి చాళుక్యుల కాలములో మొదటఁ దెలుఁగు ప్రాకృతభాషా సంప్రదాయముల నవలంబించినను దరువాతఁ గ్రమముగా దానిని విడిచి సంస్కృత సమముల నెక్కువగాఁ దనలోఁ జేర్చుకొని నన్నయ కాలమున కాతని భారతభాషకు సన్నిహితమైన రూపము నొందిన దని తలంపవచ్చును. ఈ కారణముచేతనే చాళుక్య పరిపాలనపు టుత్తరకాలమునందలి శాసనములు కొన్ని వికృతి రూపములతోఁ గూడియున్నను మనకు సుబోధములై యుండుట సంభవించినది. విజయాదిత్యపాదభ్రమరాయమాణ, సమస్త రాజ్యభర నిరూపిత మహామన్త్రాధిపతి, దేవబ్రాహ్మణ గురుభక్తిసనాథ, త్రిభువనాభరణుండు, శివ పద వరరాజ్య సేవితుండు మున్నగు నప్పటి శాసనములలోని సమాసరూపములకు నిదర్శనములు.

నన్నయకుఁ బూర్వము గల శాసనముల భాషలోఁ బ్రధానముగా నీ క్రింది లక్షణములు కానవచ్చుచున్నవి. 'ఴ' యను వింత యక్షర మొకటి వానిలో నధికముగా గోచరించుచుండును. ఈయక్షరమును దాని ధ్వనియు నన్నయ నాఁటికే తెనుఁగున విరళములై పోయినవి. అది తెనుఁగునఁ జాలచోట్ల 'డ' 'ళ' కారములలో నొక యక్షరముగా మాఱిపోయినది (రామవిభుతోఴ నెడరిన, చోఴమహారాజు) కన్నడమున దీనికి ఱళ మని పేరు. ఇది ప్రాచీన కన్నడమున నుండెను. గాని తెలుఁగునవలెనే తరువాత నందుఁగూడ ళ కారముగా మార్పు చెందినది. తమిళమున నది ప్రాచీన కాలమునుండియు గానవచ్చుచునే యున్నది. వ్యవహారమున మాత్ర మందును నిది మాఱి వేఱువేఱు ధ్వనులతో నుచ్చరింపఁబడుచున్నది. ఴకార ళకారములతోఁ గూడిన పదము లా శాసనములలో నధికముగాఁ గానఁబడును. తెలుఁగునఁ గ్రమముగా 'నల' కారములు వీనిస్థాన

ము నాక్రమించినవి. కాని తమిళ కర్ణాటకములలో నిప్పటికిని గొన్నిచోట్ల నవి మార్పు చెందక యట్లె యుండిపోయినవి. (గొణిన, కళ లేని, బణిగొని సంవత్సరంబుళ్, ఏళు వేళు) సంస్కృత పదములలో ణకార ముండవలసిన చోటఁ బెక్కెడల నకారము వ్రాయఁబడినది. తెనుఁగున మూర్ధన్య ణకారము ప్రచురణముగా నుండుటచే సంస్కృతమున దంత్య నకార ముండునని యప్పటి లేఖకులు భ్రమపడి యుందురు (భ్రమర యనూన, హీనపురము) ఇప్పుడు సాధురేఫముతో నుండు రూపములు పెక్కెప్పుడు శకటరేఫములుగా వ్రాయఁబడియున్నవి. సంయుక్తాక్షరములలోఁ గ్రిందను మీఁదను గూడ శకట రేఫములు కానవచ్చుట మఱియొక విశేషము. (తూర్పు, వైదుంబవోలు, వాన్డు) రేఫముతో మఱొక హల్లును సంయుక్తముగా వ్రాయవలసిన చోట్ల నప్పుడిప్పటివలెఁ గాక యా యక్షరమును ద్విరుక్తముగా వ్రాసి రేఫమునకు బదులు వలపలగిలక వ్రాయుచుండిరి. ఈ యాచార మిప్పటికిని వృద్ధుల వ్రాతలలోఁ గానవచ్చును. (శమ్మ్ఱ నవ్వఱ) ! ఇప్పటి నిండుసున్న లప్పుడు వర్గపంచమాక్షరములుగా వ్రాయఁబడుచుండుటచే ననునాసికములతోఁ గూడిన సంయుక్తాక్షరములు విరివిగాఁ గానవచ్చును. (వేంగివాణ్ట్రి, చెఞ్చున, చమ్బున రెణ్డు) అప్పుడఱసున్నలకు బదులు నిండుసున్నలే వ్రాయఁబడుచుండెను. నిండుసున్నలుండవలసిన చోటఁ గొన్ని యెడల హల్లునకు ద్విత్వము కానఁబడుచున్నది ఇట్లు హల్లు ద్విరుక్తమైన చోట్ల ననుస్వారము నెఱసున్న యనియుఁ బెఱ చోట్ల నఱసున్న యనియు నెఱుంగనగును. నేఁడు దీర్ఘము లున్న చోట్ల హ్రస్వములును, బరుషము లుండుచోట్ల సరళములును, నప్పుడు విస్తారముగా గోచరించును 'శమన' లాండ్రోంటితోఁ దాఱు మూ అగుచుండుట తెలుచు. ఇందుఁ గొన్ని యప్పటి శాసనలేఖకుల పొఱపాట్లు కూడఁ గానవచ్చును (సత్తి, రాజులాకు, తీనికి, దప్పినవారు) ఇప్పుడు ప్రథమావిభక్తి 'డు' ప్రత్యయ ముండుచోట నప్పుడు నబిందు నిర్బిందుక బువర్ణములు రెండును గోచరించును (వక్రిబు, వక్రింబు) నేఁటి బహువచనములు

ప్రత్యయ మప్పుడు వివిధరూపములతోఁ గాన వచ్చుచున్నది. -లు, ళు, గళ్, గళు, ఙ్ళు, మున్నగున వట్టి వానిలోఁ గొన్ని. సాధారణముగా దత్సమ పదముల చివర ళ కారమును, దేశీయపదములతరువాత కళ్ గళ్ అనునవియుఁ గనవచ్చుటచే నప్పటివా రనుచిత విభాగముచే కళ్ గళ్ అనువానిలోని చివరి యక్షరమును మాత్రమే బహువచన ప్రత్యయముగా భావించి మొదటిదానిని బదభాగముగానే తలంచుచుండి రని తెలియుచున్నది (కొణ్డుకళ్) తరువాత నీ ళకారము లు అనురూపమును బొంది భాషలో స్థిరపడినది. ఊళ్లు, రట్టళ్లు మొదలగు బహువచనాంతరూపములుఁగూడ నచ్చటచ్చట గలవు. ఈ శాసనములలో సమాపక క్రియలరుదుగా వాడఁబడుచుండెను. కాని యట్టి క్రియారూపము లసలు లేకపోలేదు. క్రొచ్చె, ఇచ్చిరి, చేసిరి వంటి భూత కాలరూపములును, గొణ్డు, అగు మున్నగు భవిష్యదర్థక తద్ధర్మ రూపములును గొన్ని కానవచ్చుచున్నవి, ఎత్తిఇచ్చె, కట్టిఇచ్చె వంటి ప్రేరణార్థకరూపములును, అగు అను తద్ధర్మక్రియాజన్య విశేషణమును (అగుసేణ్డు) వెల్వారించినక్ వంటి చేదర్థకములును, కట్టిఇచ్చి, విడిచి, పసి, మెచ్చక, ఎఱుంగక వంటి క్త్వార్థక వ్యతిరేక త్వార్థక రూపములును, పట్టం కట్టబడిరి, కట్టబడినవాను అను రెండు మూఁడు కర్మార్థక రూపములును గూడ నం దచ్చటచ్చట నున్నవి.

ఈ శాసనములలో రెం డచ్చుల వ్యవహితములై వచ్చినప్పుడు సంధి లేకపోవుటయే తఱుచు. సంధి లేనిచోట ఇచ్చిన యూరి (650) రచ్చుయిల్లు (650) కొఁయుండు (890) మున్నగు కొన్ని స్థలముల యడాగమము కాన వచ్చుచున్నది. సంధి కావలసినచోటఁ గూడ యడాగమముతోఁ గూడిన స్థలములు కొన్నిగలవు. (సంవత్సరంబుల్ యేనగు (650) కుడుచు వారు యిళ్ళ) బణిసేసిన, దయసేసి (అహదనకర) పురము సొచ్చె (చాళుక్య భీమరాజు) మున్నగు స్థలములందు గసడదవాదేశ సంధి కానఁ బడుచున్నది.

ఈ చాళుక్యుల శాసనములలోఁగూడ నంతకుఁ బూర్వమునందలి వానివలెనే యచ్చమైన సారస్వత మని చెప్పఁ దగిన రచన మృగ్యము.

ఇవన్నియు దానవిషయములతోడను, దానిని జెఱిచినచోఁ గలుగు పాపముల వివరముల తోడను, దానకర్తల బిరుదావళుల తోడను గూడి యున్నవి. 9వ శతాబ్దికిఁ బూర్వమున్న వచనశాసనములోఁ గొన్ని పదములే తప్ప వాక్యము లేవియుఁ బూర్తిగా నర్థమగుటలేదు. అందుఁ బ్రాకృతభాషాసంపర్క మెక్కువ యుండుటయు, దేశీయపదములైనను బ్రాచీనరూపములతోఁ గూడియుండుటయు నిందుకుఁ గారణము. ఈ శాసనములు చాళుక్యరాజుల కాలమునఁ దెలుఁగునకు గౌరవము హెచ్చె ననియు నది జనులచే విరివిగా వ్యవహరింపఁబడు చుండె ననియు మాత్రము సూచించుచున్నవి. పద్యశాసనములను బట్టి యా కాలపు ఛందోవిశేషములఁ గొన్నింటి నెఱుంగ వీలగుచున్నది. యుద్ధమల్లుని బెజవాడ శాసనములలో నన్నియు మధ్యాక్కరలే కలవు. మూఁడవ విజయాదిత్యుని కాలమునందలి రెండుశాసనములలో సీసపద్యమును, పండరంగుని అద్దంకి శాసనమునఁ దరువోజయుఁ గలవు. ఈ పద్యములన్నియు దేశీయము లైనవే. సంస్కృత వృత్తములను వాడు నాచారమప్పటి కింకను బ్రచారము నొందియుండ లేదు. ద్విపదములును వానివలెనే దేశీయము లైన వృత్తములును మాత్రమే యప్పుడు వాడుకలో నుండినట్లు కానవచ్చుచున్నది. ద్విపదలను వ్రాయునప్పుడిన్ని పాదములను వ్రాయవలె నను నియమము లేదు. వ్రాయవలసిన వస్తువు విస్తృతిని బట్టి యందలి పాదములసంఖ్య నియమితమై యుండును. రెండు ద్విపద పాదము లైనచో నొక తరువోజ పాదమగును. ఇందు యతిప్రాసములతోఁ గూడిన యిట్టి పాదములు నాలుగుండును. మధ్యాక్కరలలోఁ గూడ యతిప్రాసలు కలవు. అవియును జతుష్పాదములే. ఒకప్పుడివి కూడ ద్విపదలవలెనే యనియమితసంఖ్యగల పాదములతోఁ గూడి తరువాతఁ గ్రమముగాఁ జతుష్పాదము లై యుండును. ఇట్లవి మాఱుటకు సంస్కృతవృత్తముల ప్రభావమే కారణమై యుండును. అక్కరలు కన్నడమునఁ గూడఁ బూర్వము విరివిగా వ్రాయఁబడినవి.

కాని 13వ శతాబ్దికిఁ బిమ్మటఁ బూర్తిగా నంతరించినవి. తెలుఁగులోఁ గూడ నన్నయతరువాత మధ్యాక్కరలను వ్రాసినవాఁ డొక్క యెఱ్ఱాప్రెగ్గడయే. సీసము కన్నడములో లేదు. తెలుఁగున మాత్ర మున్నది. అప్పకవి సీసము లేడు విధములని చెప్పినాఁడు. వీనిలో యతియో ప్రాసయతియో వాడు నాచార మప్పు డుండెను. నన్నయతరువాత నీ యాచారము మాఱిపోయినది. ఒక్క సమసీసము మాత్రమే భాషలో నిలిచినది. కన్నడమున నన్నయకుఁ బూర్వమే సంస్కృత వృత్తములు విరివిగా నుపయోగింపఁ బడినవి. అంతకు ముం దందులోఁ గూడ నక్కరాది దేశీయవృత్తములే యుండి యుండును. కన్నడమునవలెనే తెలుఁగునఁ గూడ నన్నయతరువాత దేశీయ వృత్తములకుఁ బ్రచారము తగ్గుటయుఁ గ్రమముగా సంస్కృత వృత్తములు వాని స్థానము నాక్రమించుటయు సంభవించినది. శాసనము లందలి యీ పద్యములను బట్టి నన్నయకు రెండు శతాబ్దులకుఁ బూర్వమే దేశీయ వృత్తములతోఁ గూడిన పద్యరచన యుండె నని విశద మగుచున్నది.

పండరంగుని యద్దంకి శాసనమునను, చాళుక్య భీమమహారాజు ధర్మవర శాసనమునను, వృత్తములతోఁ బాటు కొంత వచనము కూడ నున్నది. గద్య పద్యములతోఁ గూడిన యీ పద్ధతికే చంపూపద్ధతి యని పేరు. నన్నయాదులు భారతము నీ పద్ధతినే వ్రాసిరి. కన్నడకవులు కూడఁ దమరచనములలో నీ పద్ధతినే యవలంబించిరి. దీనిని బట్టి యీ చంపూకావ్యపద్ధతి నన్నయ క్రొత్తగాఁ దెచ్చిపెట్టినది కా దనియు నీతనికి రెండుశతాబ్దులకుఁ బూర్వమే దేశమున వాడుకలో నుండె ననియుఁ దెలియుచున్నది. సంస్కృతమున నీ చంపూకావ్య రచనాపద్ధతి క్రీ. శ. 10వ శతాబ్దికిఁ బూర్వ మున్నట్లు కానరాదు. అందీ పద్ధతిని మొట్టమొదట నవలంబించినవాఁడు చంపూరామాయణ కర్తయైన భోజుఁడే యని తోఁచుచున్నది. ఈ చంపూపద్ధతి తొలుత దేశభాషలందే ప్రచారమున కెక్కె ననియు, నం దుండియే సంస్కృతమునకుఁ బ్రాఁకె ననియుఁ గొందఱు తలఁచుచున్నారు.

పైని పేర్కొనఁబడిన శాసనమువలన నన్నయను రెండుశతాబ్దులకుఁ బూర్వము నుండియుఁ దెలుఁగున దేశీయ వృత్తములును బద్యరచనయు నుండె నని తెలియుచున్నది. నన్నయకుఁ బూర్వ మందలి కావ్యము లేవియు మనకుఁ గానఁబడుట లేదు. అసలు నిర్మింపఁబడెనో లేదో కూడఁ దెలియదు. శాసనస్థము లైన పద్యములకంటె భిన్నమైన వాఙ్మయ మేమైన నప్పు డుండెనా? ఉండినచో నది యే రూపమున నుండెను? అను ప్రశ్నలను మనము విచారింపవలసి యున్నది. మానసమున సంతోషవిషాదాదులకు వేరికి సంబంధించిన వై నను నిశితము లైన భావములు కలిగినప్పు డవి సాధారణముగా లయాన్వితమైన భాషలో వ్యక్తము లగుచుండునని విమర్శకులు నుడువుచున్నారు. సంస్కృతమున నాదికవి యైన వాల్మీకి హృదయమున నుప్పతిల్లిన శోకమే శ్లోకత్వమును బొందె ననుట సుప్రసిద్ధ విషయమే. నన్నయకుఁ బూర్వము నందలి తెలుఁగు వారికి వివిధసమయములం దట్టి నిశితభావము లుప్పతిల్లి యుండు ననుటలో సందేహ మేమియు లేదు. అప్పుడు వా రా భావములను బాటలలోనో పద్యములలోనో వ్యక్తము చేసియుందురు. అవి మన కిప్పుడు లభ్యములు కాకపోవుటచే వానిస్వరూపమును నిర్ణయింపఁజాలకున్నాము, పాల్కురికి సోమనాథుఁడు (క్రీ. శ. 13వ శతాబ్ది) పండితారాధ్య చరిత్రమున శ్రీశైలమునకుఁ బోవు భక్తులు తుమ్మెద పదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు మొదలగునవి పాడుచుండి రని వ్రాసియుండెను. మఱియు నాతఁడు బసవ పురాణమునఁ బ్రాచీనశివభక్తుల చరిత్రములను బురాతన గీతములను బట్టి రచించితి నని చెప్పుకొనెను. పైని పేర్కొనఁబడిన పురాతన గీతములును బదములును నన్నయకు సమకాలముననో లేక పూర్వముననో రచింపబడి ప్రచారమున నుండె నని చెప్పుట కవకాశ మున్నది.

పండితారాధ్య చరిత్రమున సోమనాథుఁడు "అనియతగణాః, ప్రాసో వా, యతి ర్వా యని సంస్కృతోక్తులను మూడింటి నుదాహరిం

చినాఁడు. యతిప్రాసముల విషయమును అనియతములైన మాత్రాగణముల ప్రస్తావమును నిం దుండుటచే నివి తెలుఁగు ఛందస్సునకు సంబంధించిన సంస్కృత సూత్రము లై యుండు ననియు, వీనితోఁ గూడిన ఛందోగ్రంథములు బహుశః నన్నయ కర్వాచీనము కాఁగూడ దనియు కీ. శే. వే. ప్రభాకరశాస్త్రిగా రభిప్రాయపడి యున్నారు. దీనిని బట్టి యంతకుఁ బూర్వమే మాత్రాగణబద్ధములై యతిప్రాస ములు కలిగియుండు రచనలు విరివిగా నుండు నని తెలియుచున్నది. ద్రావిడ భాషలోఁ బదొకండవ శతాబ్దిఁ జెందిన యాప్పిరంగలమ్ అను ఛందో గ్రంథ మొకటి యున్నది. ఆగ్రంథకర్త యందు తెలుఁగు కర్ణాట ఛ్ఛందములఁ గూర్చి ప్రస్తావించుటయే కాక వాంచియ రచించిన తెలుఁగు గ్రంథమును జూచి తా నాగ్రంథమును వ్రాసినట్లు చెప్పుకొనెను. (వాంచి యార్ శెయిదవడఘు చందవుం) వాంచియ వ్రాసిన తెలుఁగు ఛందో గ్రంథ మేదియు మనకుఁ గానవచ్చుటలేదు. ప్రాచీన లిపిపఠన నిపుణులు కొందఱు వాంచియర్ అనుపదమును రేచియర్ అని చదివియుండిరి. అగుచో నాఛందోగ్రంథము రేచన (రేచియ) రచించిన కవిజనాశ్రయమై యుండును. రేచన కై నేఁడు. యాప్పిరంగలమ్ కర్తకూడ జైనుఁడే. అందుచే నాతఁడు రేచనగ్రంథమును వ్రాసి యుండె ననుకొనుటలో నసందర్భ మేమియు నుండదు. అతఁడు రేచన యైనను గాకున్నను ఆ తెలుఁగు ఛందము నన్నయకు సమకాలికుఁడో యించుకపూర్వుఁడో యైన యాప్పిరంగలమ్ కర్తకుఁ బూర్వుఁడనుటలో సందేహము లేదు. అతఁడు ఛందోగ్రంథము వ్రాసె ననఁగా నంతకుఁ బూర్వమే తెనుఁగున వివిధములైన ఛందములును, దద్రచితము లైన పద్యములును నుండె నని మన మూహింప వచ్చును. పైని పేర్కొనఁబడిన నిదర్శనములను బట్టి నన్నయకుఁ బూర్వము పాటలు, రగడలు, ద్విపదలు, మంజరులు, అక్కఱలు, సీసములు మొదలైన ఛందోవిశేషములు విరివిగా నుండె నని చెప్పవచ్చును. వీనిలో రచింపఁబడిన యప్పటి కవిత్వము లభింపక పోవుట దురదృష్టము.

నన్నయకుఁ బూర్వముండిన కవిత్వముయొక్క పరిస్థితిని దెలిసికొనుటకు నన్నెచోడుని కుమారసంభవము నందలి యీ క్రింది పద్యము కొంత యాధార మగుచున్నది.

మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవిత పుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలగు పలువుర్.

కుమారసంభవమును మొదట ముద్రించినపుడు శ్రీ మా. రామకృష్ణకవిగా రీ పద్యమునందలి చివరి పాదమునఁ జననత్యాశ్రయునిఁ దొట్టి చాళుక్యనృపుల్ అని ముద్రించియుండుటచేఁ బలువురు దాని నాధారము చేసికొని నన్నెచోడుని నన్నయకంటెఁ బూర్వునిఁగా నిరూపింప యత్నించిరి. కుమారసంభవమునకుఁ దాళపత్రప్రతియొక్కటి తంజాపురపుస్తక భాండాగారముననే కల దనియు, నం దీ పాఠముకాక చాళుక్యరాజు మొదలగు పలువు రను పాఠమే యున్న దనియు, నందుచేఁ గవిగా రొసఁగిన పాఠమును గ్రహింప వీలులే దనియు శ్రీప్రభాకరశాస్త్రిగా రుద్ఘాటించి యున్నారు. పై పద్యమునందలి చాళుక్యరాజు రాజరాజనరేంద్రుఁడే యనియు నాతఁడే యాంధ్రదేశమున దేశికవిత పుట్టించె ననియుఁ జెప్పుకొనుట కాక్షేప ముండదు. ఏల యనఁ దెనుఁగున మొదటి కావ్యమైన భారత మాతని కాలముననే యాతని యాస్థానముననే యాతని ప్రేరణముననే రచింపఁబడియున్నది.

పై పద్యమున రాజరాజనరేంద్రునకుఁ బూర్వము లోకమున మార్గకవిత వెలసి యుండె నని తెల్పఁబడినది ఈ మార్గకవిత యే దను ప్రశ్నకు సమాధానము నరయు నపుడు మన మా కాలమున నుండెడి భాషాపరిస్థితులను బాగుగాఁ బరిశీలింపవలయును. ఆంధ్రదేశమున నప్పుడు విద్యయన్నను బాండిత్య మన్నను సంస్కృతమునకు సంబంధించినదే. సంస్కృతభాషాపండితులే యప్పుడు గౌరవింపఁబడుచుండిరి. ఆకారణముచేఁ బలువురు ప్రతిభావంతు లాభాషనే చదివి యుండే

కవిత్వము నెలయించుచుండిరి. అప్పుడు దేశభాషలయందలి కవిత్వమును బండితులు మిక్కిలి లఘుభావముతోఁ జూచుచుండిరి. అప్పుడే యనేల తరువాత నాలుగైదు శతాబ్దులవరకును దేశభాషాకవిత్వమునకా హైన్యము తొలఁగించి యుండలేదు

> విలసద్భావరసార్థ్యలంకృతులచే విఖ్యాతి గీర్వాణ భా
> షల కబ్బంబుల కన్న మంచితనముల్ సంధిల్లు నాచంద్రమై
> కలియుం బ్రాసమువంత కగ్గములై వర్తిల్లు సత్కావ్యముం
> దెలుఁగంచున్ జెవిఁ బెట్టలేమి యుడుపం దేఁ గల్గునే మందిలన్.

అని చిన్నకోట పెద్దన వ్రాసిన పద్యమును బట్టి తెలుఁగున భారతాది మహాకావ్యములు విలసిల్లిన యాతని కాలమునఁ గూడఁ బండితులకుఁ దెలుఁగు కవిత్వ మన్న నీసగింపుగనే యుండె నని తెలియుచున్నది. బహుశః సంస్కృతాంధ్రములు రెండింట నిరాఘాట పాండిత్యము వహించి, రెడ్డిరాజుల యాస్థానమున విద్యాధికారియై తెలుఁగున బహుప్రబంధములు రచించిన శ్రీనాథుని కాలమునకును దెనుఁగునకా దుర్గతి దూరమైయుండదు. ప్రధానముగాఁ దెనుగునకవియై శ్రీనాథుఁడు సంస్కృతమున నుద్దండ పండితుఁడైన డిండిము నోడించి యాతని కంచుఢక్క పగులఁ గొట్టించి కనకాభిషేకమును బొందుట యంతకుముందు సంస్కృత మధిష్ఠించిన సింహాసనమును దెనుఁగాక్రమించుటకు నిదర్శనముగా నున్నది. నన్నయ తెనుఁగున భారతమును వ్రాయఁబూని నప్పు డాతని నాక్షేపించిన వారు, నిరసించిన వారు నిరోధించినవారు పలువు రుండి యుందురు అప్పు డాతనికి సంస్కృత పండితులతోఁ గలిగిన వాదోపవాదములలో నతని సహాధ్యాయుండును బహుభాషావిశారదుఁడును నగు నారాయణభట్టు చేదోడు వాదోడై వర్తించియుండును. నిశ్చలమైన ధైర్యమును నంతకంటెను బ్రోత్సాహకరమైన రాజాశ్రయమును లేనిచో నన్నయ యా కాలమున నాంధ్రమును వ్రాయఁ జాలక పోయియే యుండును. ప్రతిభావంతుఁ డగుటచే నాతఁడు తన రచనలో సంస్కృత పదములనే హెచ్చుగా

వాడి యొకవంక దేశభాషాకవితో ద్దారకుఁడైన రాజునకును సంస్కృత భాషాభిమానులగు పండితులకును గూడఁ బ్రీతి కలిగించుటకు యత్నించి యుండును. కన్నడ భాషలలో నంతకు ముందే యట్టి రచనాపద్ధతి కలదు. నారాయణభట్టు దాని నాదర్శముగాఁ జూపుట చేతనో లేక తానుగూడ స్వయముగాఁ గన్నడగ్రంథములను జదివి యుండుటచేతనో నన్నయ ధైర్యము వహించి యీ పద్ధతి నవలంబించి యుండును.

దీనిని బట్టి నన్నయకుఁ బూర్వ ముండిన మార్గకవిత్వ మేదియను ప్రశ్నకు సంస్కృతమే యని సమాధానము చెప్పవలయును కాని దీనికిని నన్నెచోడుని కుమారసంభవము నందలి యొక విషయము బాధకముగా నున్నది. అతఁ డొక పద్యమున మార్గకు మార్గ మనియు, దానిని విడువ మన సొప్పక దుర్మార్గపదవర్తు లనఁదగు మార్గకవులం దలంప నలఁతి మహి సుకవుల కనియు మార్గకవితాపద్ధతిని దెగనాడి యుండెను. సంస్కృత భాషామహాకవుల నాతఁడు తన కావ్యమున భక్తిపూర్వకముగాఁ బేర్కొని సన్నుతించియే యుండెను. అందుచే నాతఁడు మార్గకవిత్వ మని పేర్కొన్నది సంస్కృతకవిత్వము కంటె భిన్నమైన దేదో మఱి యొకటై యుండవలయును. అది యేది ?

పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకములో నొక్క తెలుఁగు పద్యములే కాక సంస్కృతము, కన్నడము, మహారాష్ట్రము, అరవము మున్నగు భాషలందు రచింపఁబడిన పద్యములు గొన్ని కలవు, నిన్నీభాషతో సంస్తుతించెను, ఈ భాషతో నుతించెద నని చెప్పుచు నా శతకమున నాతఁడు వివిధభాషావాక్యములతోఁ గూడిన పద్యములు కొన్ని వ్రాసెను. ఆ సందర్భమున మణిప్రవాళశైలి యొక్కెడ నవలంబింపఁ బడినది. మణులును బ్రవాళములును గలసియుండున ట్లా శైలిలోఁ దెలుఁగు పదములును సంస్కృత విభక్త్యంతములగు పదములు గలసి యుండును. ఇట్టి శైలీ సంప్రదాయము మళయాళమున విస్తారముగా గోచరించు నని చెప్పుదురు. అట్టిశైలి తన కాలమున బ్రచారమున నుండిన కతముననే సోమనాథు డందుగూడ నొక

పద్యమును వ్రాసి నృపాధిపుని సంస్తుతించి యుండెను. క్రీ. శ. 23 వ శతాబ్దిలో నివసించిన కేతన యాంధ్రభాషా భూషణమున నట్టి శైలి పరిహార్య మని సూచించియుండెను. నిజముగా నట్టి సంప్రదాయ మొకటి దేశమున నుండనిచో దానిని సూచించి యాతఁ డది వర్జ్యమని చెప్పవలసిన యక్కఱ యుండదు. అట్టి రీతి నన్నయకుఁ దరువాత విరళమై క్రమముగాఁ నంతరించి పోయినను, అంతకు బూర్వము కొంత ప్రచారము గాంచి యుండు ననుట కవకాశము కలదు. అప్పుడు పండితులు సంస్కృత భాష యం దుండిన యతిప్రీతిచే దానిని విడువఁ జాలక, సంస్కృత శబ్దములను సంస్కృత సమములుగా కూర్చకుండ సిద్ధ రూపములతోనే తెలుఁగు మాటలతోఁ గలిపి వాడుకొనుచుండి యుందురు. ఇట్టిమణి ప్రవాళశైలితో వ్రాయఁబడిన కవిత కూడఁ గొంత యప్పు డుద్భవించియుఁ దరువాత మిక్కిలి దుష్టము గాఁబరిగణింపఁబడుటచే రూపుమాసి యుండును. అచ్చటచ్చటఁ దెలుఁగు మాటలుకూడ నుండినను జాలవఱకు సంస్కృత పదములతోడనే కూడి యుండిన యాశైలికవిత్వమునే నన్నచోడుఁడు మార్గకవిత్వమని పేర్కొని యుండవచ్చును. అందుచేతనే యాతఁడు దానిని నింద్యము గాఁబరిగణించి యుండును. ఈ విధముగాఁ జెప్పుకొన్నచో నాతని వ్రాఁత కొక విధముగా సమన్వయము కుదుర్చుకొనవచ్చును. కాని శాసనము లందెచ్చటను ఆశైలిని రచింపబడిన పద్య మొకటియుఁ గానరాకుండుట యీయూహ నించుక బలహీనము కావించుచున్నది.

మార్గకవిత్వము సంస్కృత కవిత్వమైనను అది ప్రచారమున నుండగా రాజరాజు దేశికవితకు అనఁగా దెనుఁగు భాషలో భారతము రచించుటకుఁ బ్రోత్సాహ మొసంగి యుండును. నిజముగా నప్పుడు రాజరాజువంటి దేశ భాషాలాలసుఁ డైన రాజే యుండనిచోఁ దెలుఁగు నిలువకయే యుండెడిదని చెప్పవచ్చును. అగుచో రాజరాజునకు ముందే శాసనాదులలోఁ బద్యములు కానవచ్చుచుండగా నాతఁడే దేశికవిత పుట్టించె ననుట సమంజసముగా నుండునా? ఆతనికి ముందు

తెనుఁగున నొకరకమైన కవిత యుండె నని యొప్పుకొనక తప్పని మాట నిజమే కాని యది దేశీయ వృత్తముల తోడను ద్విపదల తోడను నిబద్ధమై కావ్య గౌరవమునకుఁ జాలక సామాన్య జనులలో మాత్రమే ప్రచారముఁ బడయుచు బండితుల యాదరమునకు బాత్రమై యుండక పోవచ్చును. జను లా పాటలను, పదములను దేశీయగీతములను నుత్సాహము జనించినపుడు పాడుకొని యానందించి యుందురు. వానిని రచించినవారు కూడ సంస్కృత భాషాపండితులు కాక సామాన్యులై యుందురు. అట్టివి సామాన్యముగా గ్రంథస్థము లగుటయే యరుదు. అయినవి సైత మప్పటి మత వైషమ్యములకు ఫలితముగా మతాంతరావలంబులచే నడఁగింపఁబడియుండును. కాఁగాఁ దెనుఁగునఁ బండితాదరమునకు బాత్రమై కావ్య మనిపించుకొనఁదగిన మొదటి రచనకుఁ గారకుఁడైన వాఁడు రాజరాజనరేంద్రుఁడే యై యుండును అందు చేతనే దేశికవిత పుట్టించి తెనుఁగును నిలిపిన మహా గౌరవ మాతనికి దక్కినది.

ఈ దేశికవిత్వము కూడ నప్పు డిరు తెఱంగులుగా నున్నట్లు కానిపించుచున్నది. అందుఁ దత్సమ పదబాహుళ్యమును దీర్ఘసంస్కృత సమాస ప్రాచుర్యమును గలిగిన దొకటి. తత్సమ పదవైరళ్యము తోడను నాచ్ఛిక పద బాహుళ్యము తోడను గూడినదొకటి. ఈరెండు పద్ధతులును గూడ నన్నయకుఁ బూర్వముండిన శాసనముల రచనలోఁ గానవచ్చుచున్నవి. ఇందు మొదటి దానినవలంబించి భారతమునందే రచించి నన్నయ దాని కతిప్రచారము కలిగించెను. తరువాత కవులలో నల్ప సంఖ్యాకులు తప్ప మిగిలినవారందరును దానినే యనుసరించి యనేక కావ్యములును రచించి యుండిరి, శ్రీనాథుఁడును ప్రబంధకవులును నా పద్ధతికి మఱింత ప్రాచుర్యము చేకూర్చిరి. ఈ నాఁటి వఱకుఁ గూడ నా పద్ధతియే నిరాటంకముగా సాగుచున్న దని చెప్పవచ్చును. ఇంక నన్నయకుఁబూర్వ ముండె నని భావింపబడు దేశీయవృత్త మాత్రచ్ఛందోనిబద్ధము లైన పదాదులలో నా రెండవ పద్ధతి యవలంబింపఁబడియుండును, దాని నప్పటి పండితు లంతగా నాదరించి యుండ

తే దనియు నందుచేతనే నన్నయ సంస్కృతపద భూయిష్ఠ మయిన శైలి నవలంబించి యుండె ననియు జెప్పి యుంటిమి. నన్నయ తరువాతఁ బ్రసిద్ధి నందిన శైవకవులు సంస్కృతపదభూయిష్ఠ మైన శైలి సర్వ సామాన్యము కా దనియు బ్రసన్న మైన జాను తెనుఁగు కావ్యరచనకు దగిన దనియు భావించి తా మా జాను తెనుఁగుననే తమ కావ్యములను రచించి నట్లు చెప్పుకొని యుండిరి. ఈ జాను తెనుఁగు బహుశః విరళ సంస్కృత పదఘటిత మైన యా రెండవ పద్ధతి బరిణామరూపమే కావచ్చును. పాల్కురికి సోమనాథుఁడు వృషాధిపశతకములోఁ జాను తెనుఁ గని పేర్కొన్న 'బలుపొడతోలు సీరయును' నను పద్యము తరువాత వెలువడిన యచ్చ తెనుఁగు కావ్యములలోని పద్యమును బోలి యున్నది. అందుసంస్కృతపద మొక్కటియును లేదు. దీనినిఁబట్టి సంస్కృతపదరహిత మైన యచ్చ తెనుఁగునే శైవకవులు జాను తెనుఁగుగా భావించి రనుటకు వీలు లేదు. ఏల యన వారి కావ్యములలో నన్నయ భారతమున వాడినన్ని సంస్కృతపదములు లేక పోయినను అవి యసలు లేక పో లేదు. కుమార సంభవమున దీర్ఘ సంస్కృత సమాసఘటితము లైన పద్యము లెన్నో కలవు. ద్విపదరచితము లైన బసవపురాణ పండితారాధ్య చరిత్రలలోఁ గూడ దత్సమపదములును సంస్కృత సమాసములును విరివిగానే కానవచ్చుచున్నవి. అందుచే సాధ్యమైనంతవఱకు సంస్కృత పదములు తగ్గించి, దేశీయపదములతోడను జాతీయపదములతోడను, జాతీయప్రయోగములతోడను గూర్చిన కవిత్వమునే వారు జాను తెనుఁ గని భావించి రని తలంపవచ్చును. ఒక విధముగా జూడఁ దిక్కన రచించిన భారతమున దేశీయపదఘటిత మైన శైలి శైవ కవులరచనముల కంటెను బ్రస్ఫుటముగ నుండు ననియు బైని పేర్కొనఁబడెను. రెండవపద్ధతికిఁ జెందిన దేశికవిత యాతని భారతముననే పరిణతి నొందిన దనియుఁ జెప్పవచ్చును. తరువాత బయలు దేఱిన పదవాఙ్మయమును బాటలును వ్యాకరణాది సంస్కారహీనము లైనను గొంచె మించుమించుగా నీ పద్ధతినే రచింపఁబడి

యున్నవి. నన్నయ భారతమును గూడ నిట్టి శైలితోఁగూడిన పద్యము లెడనెడ లేకపోలేదు. అందుచే నన్నెచోడుఁడు చాళుక్య రాజు దేశి కవిత పుట్టించె నన్నప్పు డీ యిరుతెలుఁగుల దేశికవితా పద్ధతులను మనసునం దుంచుకొనియే చెప్పి తన కందు రెండవది ప్రీతిపాత్ర మగుటచే దానినే యవలంబించె నని తలంప వచ్చును.

పద్యములు శిలాక్షరములై శాసనములలోఁ గానవచ్చుచుం డఁగాఁ, బదములు పాటలు మున్నగు వానితోఁ గూడిన వాఙ్మయము కొంత తప్పక నన్నయకుఁ బూర్వముండి యుండు నని యూహించుట కవకాశ ముండఁగా, నన్నయ యాంధ్రమున నాదికవి యనుటకు సులక్షణ మైన భాషలో నుదాత్తమైన కావ్యమును బండితాపండిత జనప్రమోద ముగా మొట్ట మొదట నాతఁడుఁ వ్రాయుటయే కారణము. కాని వేఱు కాదు. ఆతనికి ముం దుండిన వాఙ్మయము నప్పటి పండితులు కవిత్వ మని యాదరింపలేదు. దాని కవితాపాటవమును బరిశీలించుట కది తరువాత లభ్యము కాలేదు. నన్నయ దివ్య కవితా తేజము ముం దది వివర్ణమై రూపము గోల్పోయి మినుకు మినుకు మని సన్నగా వెల్గివచ్చు చు నిప్పుడిప్పుడు కొంత దోహదము లభింపఁ గాంతిసంతానమును బరగింప నారంభించుచున్నది.

దివాకర్ల వేంకటావధాని. ఎం. ఏ. ఆనర్సు.
AI/ 559 నల్లకుంట.
జామై ఉస్మానియా P. O. హైదరాబాదు (Dn.)

గ్రంథ సమీక్ష

జ్ఞానసింధువు—మోహ వివేక యుద్ధ సారసంగ్రహము:—

గ్రంథకర్త: గొల్ల శివప్పగారు- పెద్దహోతూరు, ఆస్పరిపోస్టు, బళ్లారిజిల్లా.

కన్నడమున శ్రీ చిదానందులవారు షట్పదులలో రచించిన జ్ఞానసింధువను జ్ఞానప్రబోధకగ్రంథమును గ్రంథకర్త ఆంధ్రపద్యకావ్యముగా ననువదించియున్నారు. అందు 43 తరంగములు- 1500 పద్యములు గలవఁట. అది యింకను నముద్రితము. తన్ముద్రణమునకయి యుదారహృదయులగు భాషాభిమానుల ధనసాహాయ్యము నర్థించుచుఁ బ్రకృతమా గ్రంథమందలి యొక తరంగములోఁ "మోహవివేక యుద్ధసార సంగ్రహ"మను విషయమేఁబదిపద్యములు గలది మచ్చుతునకగా గ్రంథకర్త 1947 సంవత్సరములో బ్రకటించినారు. నామమును బట్టియే యందలి విషయస్వరూప మెఱుంగనగును. సదాశివుఁడు షణ్ముఖునకు బోధించినట్లుగా, నిది చెప్పఁబడినది. మాయా లలన తనయుఁడయిన మానసునకు, కామ్యాఽకామ్యక లను భార్యలందుదయించిన మోహుఁడు. వివేకుఁడు నను సవతిసోదరులకు దేహరాజ్యాధికారమునకయి జరిగిన పోరాట మిందభివర్ణితము. సంస్కృతభాషయందలి ప్రబోధచంద్రోదయాదికృతులు శ్రీ చిదానందస్వామి కర్ణాటమూలగ్రంథమునకు స్ఫోరకములుగా గోచరించును. మోహుఁడు నాతని పరివారము పశుబలము నెఱపి వివేకుని దదనుచరులను మొదటఁ గొంతకాలము పాఱద్రోలి రాజ్య మాక్రమించియుండుటయుఁ గాలాంతరమున నాదాయాదులకు లోఁగి పదభ్రష్టులగుట ప్రకృతప్రకటిత గ్రంథభాగమందలి యితివృత్తము, ఆంధ్రీకరణము ధారాళముగ లలితశైలితో నలరారుచున్నది. మచ్చున కీక్రిందిపద్యము చూడనగును.

"ఏమీ! మోహుఁడు దేహరాజ్యమును దా నేలంగ నూహించెనే!
కామాద్యాప్తులతోడఁగూడి; మనలోఁ క్షాత్రంబు బెండయ్యెనే!
సామర్థ్యంబు దలంపఁడింతయుఁ; బలిష్ఠంబైన సత్త్వాననే
ధూమింబాఁగినఁబట్టి ముంతమురణాం, భోరాశిలోఁ గూలంగన్". (ప 34)

బండారు తమ్మయ్య

భీమేశ్వరపురాణము—కొన్ని స్థలవిశేషములు

దక్షారామము

చిలుకూరి పాపయ్యశాస్త్రి

క. దక్షుని సవనాగారము
దక్షారామంబు శివుఁడు తన్మధ్యమునన్
సాక్షాత్కరించియుండుట
మోక్షము భోగంబు బ్రాఁతె ముజ్జగములకున్.

భీమ. ౨-౧౬

ఈ దక్షారామము మహత్త్వమును, మఱియొక పద్యమునం దిట్లుగ్గడించియున్నాఁడు.

భీమనాథేశ్వరుని కన్నఁ బెద్దవేల్పు
దక్షవాటంబుకంటె నుత్తమపదంబు
సప్తగోదావరముకంటె సకలతీర్థ
సారమగు తీర్థరాజంబు జగతి లేదు.

౨-౧౭

భీమలింగంబు త్రిభువనస్వామి యెపుడు
సన్నిధానంబు గైకొనియున్నకతనఁ
దీర్థములలోన నుత్తమతీర్థ మయ్యె
దక్షిణానందవనవాటి దక్షవాటి.

౬-౧౬

దక్షవాటమునందు పరమేశ్వరుఁడు సాక్షాత్కరించియుండుటకును, అది భోగమోక్షనిలయమగుటకును గారణము పరమేశ్వరుని నోట మహస్థల ప్రార్థనపై నీతీరుగ ననిపించియున్నాఁడు.

గీ. ఎల్లకాలంబు నుండెద నిచట నేను
మొదలి మామామ యారామపదమునందు

వెండిగుబ్బలిపై వేడ్క వీడుకొలిపి
మేరునగరాజుపైఁ జాల మెచ్చు వదలి.

౬-౧౧

దక్షవాటమున శివగంగ రుద్రగంగ యను తీర్థములు రెండుండినట్లు భీమేశ్వరపురాణము చాటుచున్నది.

ఘనత శివగంగయును రుద్రగంగ యనఁగఁ
గూపములు రెండు దక్షవాటీపురమున
మొదలియది పాపముల నెల్ల నుడుపఁజాలు
నొకటి పితృదేవతలఁ దృప్తి మనుప నోపు.

౬-౧౩

వీనిలో రుద్రగంగ యీనాఁడు నిలిచియున్నది. ఇది యొకకూపము. భీమేశ్వరాలయప్రాకారమునందు ఈశాన్యభాగమున భైరవునియాలయమునకు వెనుక నుండినది. దానికి నెదురుగా నాయాలయ ప్రాకారమునందే నైరృతి భాగమున శివగంగ యను కూపము కూడ నుండవలయును. అది మాత్రము గానరాదు.

పరమేశ్వరుఁడు త్రిపురాసుర సంహారంబు గావించినపిదపఁ దనకుఁ జేదోడు వాదోడునైన దేవతల నందఱ నాయాస్థానముల కనిపి, త్రిపురదైతేయులకుఁ గులదైవతంబైన యద్దివ్యలింగంబును పంచఖండంబులుగా ఖండించి, పంచారామములందును పంచదివ్యలింగంబు లుండునట్లు గావించుచు మొదలిమామయగు దక్షప్రజాపతి కునికిపట్టయిన యారామంబగుట దక్షారామంబున శివసన్నిధానంబై దానుండునట్లుగా నెంచి తాను మున్నెటితటంబున విశుద్ధస్ఫటిక సంకాశంబును ద్రిలోకభామినీ విలోకన చ్ఛాయాగుళుచ్ఛాచ్ఛ జ్యోత్స్నాభిషిక్త యుక్తాంగంబగు శ్రీభీమేశ్వర లింగంబునం దధివసించెను. నేఁడు దక్షారామములోని భీమేశ్వరలింగము నేలమీఁదినుండి పదియడుగులకు హెచ్చగు నెత్తున నుండును. లింగము తెల్లనియాకృతి గలిగి స్ఫటికనిర్మితమైనట్లుండును. మనకు

నేలమీఁదఁ గానవచ్చెడిభాగమున చుట్టుకొలఁత యెనిమిది యంగుళుల వఱకు నుండును. లింగాగ్రమునమూఁడడుగులు సుమారుగ నుండును. మూలభాగమునందు చుట్టును మూఁడు ఆవరణలు గలవు. అదియంతయు చీకటితో నిండియుండును. ఆయావరణలోని గోడలందు జాతిబొమికలు గానవచ్చును. అచట పూర్వము రత్నదీపము లుండెడివని చెప్పుదురు.

ఈస్ఫటికకాంతిగల లింగమునకు క్రిందినుండి మీఁదివఱకు నల్లని చారలు జాతిలోనే గానవచ్చును. అవి పరమేశ్వరుని వ్యాఘ్రచర్మాంబరధారణమునకుఁ దార్కాణ మని వాకొందురు. ఇవిగాక లింగమునకు శిరోభాగమునకు ముందు వెనుకలలో రెండు గోతులు వంటివి గలవు ముందుండెడి దానిని పార్థప్రహార మనియు వెనుకనుండుదానిని చీల యనియు నందురు. భీమేశ్వరుని సమీపమున సతీదేవియు పార్వతీదేవియును గలరు. ఇరువురు పరమేశ్వరునిరాణులు నొకచో నుండుటయు నపూర్వమైన విషయమే. ఆ యాలయమున నీశ్వరున కభిషేకముగాని పూజగాని చేయవలయునన్న ప్రాసాదముమీఁదికిఁ బోవలయును. ఆయుచ్ఛ్రాయమును శ్రీనాథుఁ డిట్లు అగస్త్యుని ముఖమున వెల్లడించియున్నాఁడు.

అదె సంవేద్యము కోటిపల్లె యదె దక్షారామ మప్పట్టణం
బదె యభ్రంకష సౌధకూటమున హేలావాస ముచ్ఛ్రాయసం
పద సొంపారెడి భీమలింగము మహాప్రాసాద భూమీధరం
బిదె సప్తర్షినదీ ప్రవాహ మిదె సంవీక్షింపు మేకాగ్రతన్.

3.౫౪,

దక్షారామ భీమేశ్వరునకు యోజనము మేరలో నున్నది కోటిపల్లి. గౌతమీ నదీతీరమునం దున్న క్షేత్రములలో నిదియు నొక ప్రసిద్ధమైన శివక్షేత్రము శివరాత్రినాఁ డిప్పటికి నిచట గొప్పయుత్సవము జరుగును. పెక్కురు భక్తులానాఁ డచటికిఁ జేరుదురు. భీమేశ్వరుఁడు దక్షారామమున

ప్రతిష్ఠితుఁడైనసమయమునకు అభిషేకమునకు గోదావరీప్రవాహమును గొనితెచ్చుటకై సప్తర్షులు రాజమహేంద్రవరమునకు (అఖండ గౌతమీ నదీతీరమునకు) పయనించిరి. ముహూర్తము తప్పిపోకుండ పరమేశ్వరుఁడు భీమలింగమునఁ బ్రతిష్ఠితుఁడుగానై యుండఁగ నభోమణి మీఁదినుండి కాంచి, తాను భీమేశ్వరునకుఁ బ్రతిష్ఠ గావించెను. సూర్యప్రతిష్ఠితమైన లింగములకుఁ జుట్టును సోమప్రతిష్ఠితమైన లింగములన్ని దిక్కుల యందు నుండుట పరిపాటి. కావున నీభీమేశ్వర లింగమున కన్నిదిక్కులందును సోమేశ్వరులు గలరు. వారిలో నొకఁడీకోటిపల్లి యందలి సోమేశ్వరుఁడు. ఈసోమేశ్వర లింగములన్నియు దక్షారామమునకు యోజనము మేరలో దిక్కులందును విదిక్కులందును గూడఁగలవు.

తూర్పున— కోలంక యను గ్రామమున సోమేశ్వరుఁడు. ఆత్రేయీనదీతీరమున.

ఆగ్నేయమున—దంగేరు గ్రామమున—కణ్వానదీతీరమున.

దక్షిణమున—కోటిపల్లి సోమేశ్వరుఁడు-గౌతమీనదీతీరము.

నైరృతమున—కోరుమిల్లిగ్రామము. "

పశ్చిమమున—ఫులుగుర్తి సోమేశ్వరుఁడు—పిడపర్తి గ్రామమునందున్నాఁడు. ఇది తుల్యానదీతీరము నంటియున్నది.

వాయవ్యమున—వెల్లగ్రామమున— "

ఉత్తరమున చోల్లంగి సోమేశ్వరుఁడు. తుల్యానదీతీరమున.

ఈశాన్యమున—పటవలిగ్రామమున ఆత్రేయీనదీతీరమున

ఈవిధముగ దిక్కులందును విదిక్కులందును అష్టసోమేశ్వరులు నెలకొని యున్నారు. భీమేశ్వరుఁడు స్వయముగ నావిర్భవించి చంద్రభానుప్రతిష్ఠితుఁడై మహోన్నతి వెలయుచుండె ననియు, దక్షారామము సకలకళ్యాణనిలయంబు ననుట నీక్రింది గద్యము తాఁర్కాణించు చున్నది.

"వెండియుఁ జండభాను కృతప్రతిష్ఠుఁడును, అఖండలముఖ నిఖిల బర్హిర్ముఖ శిఖామణి మయూఖకిమ్మీరిత చరణారవిందుండును, సప్త పాతాళ భువన విష్కంభ నిర్భేదనసమాదితావిర్భావుండును, అమృతస్వయంభూర్జ్యోతిర్లింగమయ మూర్తిధరుండునైన భీమేశ్వరుండు భోగమోక్షప్రదాన దీక్షాధరుండై యందు వసించియుండు... అమ్మహాదేవుచేత సప్పుణ్యక్షేత్రంబు... మహాక్షేత్రంబన మహాలింగ స్థానంబన దక్షిణకాశియనఁ గల్యాణ నిలయంబన సనైశ్వర్య మహైశ్వర్యంబును సప్రతిమ నైభవంబును, నవాఙ్మానసగోచరం బును ననంఖ్యాత ప్రమథగణ సమాకీర్ణంబు నై యశేష కల్యాణనిలయంబై యొప్పును."

భీమ. ౨.౧౬.

మఱియు నీ క్రింది గద్యమున భీమనాథుని మహత్త్వము నుగ్గడించుచు, దక్షారామమున వెలసిన పరివార దేవతలను, దాని పరిసరమున నెలకొనిన తీర్థములను, భీమనాథుని సాక్షాత్కారమున భీమమండలికిఁ గలిగిన ప్రాశస్త్యమును, ఇతర క్షేత్రములకంటె దీనికిఁ జేకుఱిన గొప్పతనమును పరమేశ్వరముఖమున నిట్లు వెల్లడించియున్నాఁడు.

"అనిశం గరుణాసామ్రాజ్య పట్టాభిషిక్తుండగు నా జగజ్జెట్టివేల్పు బ్రహ్మాండకోశంబునకు మిక్కుటంబుగాఁ బెరిగిన దేహంబుఁ బొట్టిచేసి, తిరుచుట్టుమాలికలోన[1] గౌరీజనార్దన రుద్ర కేశవ వినాయక దుర్గా తాండవేశ్వర నృత్యభైరవులను దేవతాసప్తకంబు పరివేష్టింప, సకల లోకానందకర పరదారగమనపాపహరేశ్వరులు నైరృతిభాగంబున నధి వసింప[2] అంతర్గర్భగృహంబులోపల మాణిక్యాదేవీసహితుండై,[3] సలిల నిధి వృద్ధగంగా కౌంతేయసరిత్తుల్యభాగాహేలానదీ సప్తగోదావర

1. ఇచటఁ జేర్కొనిన దేవతాబృందము భీమనాథుని లింగమునకుఁ బార్శ్వమునఁ గల యావరణములో నెలకొనియున్నది.

2. ఈ తిరుచుట్టు మాలికలోనే మాణిక్యాంబికయుఁ గలదు.

3. ఇందుఁ జేర్కొనిన తీర్థము లన్నియు భీమమండలిలోఁ గలవు.

మాతృకాపరిత్యక్తమండలంబున మధ్యమలోక భాగధేయంబును, విబుధ గర్వపతాకావేదియు, ...[4] మఖకుండికాతటాక సముద్దండపుండరీకషండ మకరందబిందు గండూషాన్యగ్రసముదగ్ర మధుపమండలాహంకార ఝుంకారకోలాహల కరంబిత మకరధ్వజ భుజాదండ మండలీకృతకుసుమ కోదండ శింజినీఠంకారంబును, ఆఖండలాది దిక్పాలక భరితగోపురప్రాంగణంబును, పాదుకాఖడ్గఘుటికా రసరసాయన మూలికాంజనాకర్షణా దృశ్యాది విద్యాసిద్ధిక్షేత్రంబును,[5] అత్ర్యాత్రేయ... వాలఖిల్యాద్యష్టాశీతి సహస్ర సంయమిసమాకీర్ణంబును, కర్ణికారాంబికా కరకమలపుటఘటిత కనత్కనక మణిమయడమరుక ధమధమధ్వాన పర్జన్యగర్జానముజ్జృంభిత గుహశిఖండితాండవంబును,[6] మార్కండేశ్వర, కుండలాముఖ సంవేద్యాంతర్వేది చాళుక్యభీమేశ్వర ప్రధాన నానావిధశాఖోపశాఖా తీర్థసంబాధసంభరితంబునునై, యఖిల భువనభవనాభిరామంబైన దక్షారామంబును కైలాసమేరుమందరంబులకంటెను గాంచీచిదంబర కాళహస్తి శ్రీశైలాదిమహాస్థానంబులకంటెను, సేతుకేదారంబులకంటెను నతిశయంబుగాఁ జేసి నా క్షేత్రంబును మరగి, గరళకూట కృపీటభవ జ్వాలావష్టంభంబు సంస్తంభించి, త్రిపురదైతేయ మదవతీగండభాగమకరికాపత్త్రభంగంబులు దొలంగించి, భీమలింగంబు సర్వమంగళాదేవి యుం దానును లోకరక్షణార్థంబుగా నధిష్ఠించియుండు."

భీమ. ౬-౭౫

---

4. యజ్ఞకుండము నేఁటికిని పద్మషండములతో నిండియే యుండును.

5. దేవేంద్రుఁడు మున్నగు దేవతలు వసిష్ఠాది మహర్షులును గోపురప్రాంగణము నందు నేఁడును గానవచ్చుచునే యున్నారు. వ్యాసభగవానుఁడు ప్రాసాదము నందలి యొక స్తంభమున నెలకొనియున్నాఁడు.

6. మార్కండేశ్వరతీర్థము = రాజమహేంద్రవరము. కుండలాముఖము = కుండలేశ్వరము. సంవేద్యము = వృద్ధగౌతమీసాగరసంగమము. అంతర్వేది = వసిష్ఠ సాగరసంగమము. చాళుక్యభీమేశ్వరము=కుమారారామము.

దక్షారామమున భీమేశ్వరుని సాక్షాత్కారము తోపాటు సకల దేవతాబృందము మహర్షి వర్గము, వివిధతీర్థకదంబము సమకూడి యుండుటచే దీని మహత్త్వ మితరతీర్థములన్నిటికంటెను గొనియాడఁ దగినది యని శ్రీనాథుఁడీ గద్యమునం దుగ్గడించియున్నాఁడు. భీమనాథుని మాహాత్మ్యమున కియ్యది పరాకాష్ఠ.

దక్షారామ మాహాత్మ్య మీపురాణమునందుఁ బలుతావులఁ బలురీతులను వ్యక్తమైయున్నది. అగస్త్యుఁడు వ్యాసునితో దక్షారామముతో సరియైన భోగమోక్షధామము వేఱొకటి లేదనినాఁడు. అందులకుఁ గారణములు—ఆ పట్టణము దక్షప్రజాపతి యజ్ఞదీక్ష వహించిన పుణ్యదేశమగుట, బ్రహ్మవిష్ణుపురందరాది దేవతలు మహర్షులును సభ దీర్చిన చోటగుట, సతీదేవి శరీరమునుండి బయలుదేఱిన యోగాగ్నిని ప్రజ్జ్వలింపఁజేసిన ప్రదేశమగుట, వీరభద్రుని పరాక్రమవిహారవిలాసముల కది నాట్యరంగమగుట, అమృతమయుఁడై దివ్యతేజస్సమేతుఁడై స్వయముగ నావిర్భవించిన శాంతమూర్తియగు భీమేశ్వరుని స్థానమగుట యును. ఈ విషయము నీ తీరున శ్రీనాథుఁడు వివరించినాఁడు.

సీ. దక్షప్రజాధినాథ మహాధ్వరక్రియా
దీక్షాధిగమ పుణ్యదేశమునకు
బ్రహ్మవిష్ణుపురందర ప్రధానసుపర్వ
పరమసంయమి సభాభవనమునకు
దాక్షాయణీయోగ దహనార్చి రున్మేష
సామిధేనీమంత్ర జాతమునకు
వీరభద్రభుజావిహార హేలాసమా
రంభనాటక నాట్యరంగమునకు
నమృతమయ దివ్యతేజస్స్వయంభులింగ
శాంత భీమేశ్వరేశ్వర స్థానమునకు

దక్షవాటంబునకు మోక్షధామమునకు
భోగజన్మస్థలమునకే పురము సరియె !

భీమ. ౩-౧౭

ఇట్లు భోగమోక్షనిధానమగు దక్షవాటిలో సప్తగోదావరమున స్నానము చేసి "త్ర్యాయుషం జమదగ్నేః కశ్యపస్య త్ర్యాయుషం" ఇత్యాది మంత్రముచే నభిమంత్రించిన విభూతిని మూఁడు రేకల ధరించి, మొదటి ప్రాకారము దాఁటి లోనికిఁ జొచ్చి, క్రిందిభాగమున నందీశ్వరుని, మీఁదనున్న విఘ్నుని జూచి, మణిఖచితమైన సోపానమార్గమున భీమేశ్వరుఁడు నెలకొనిన మేడనెక్కి, సప్తపాతాళములను భేదించి వెడలిన జ్యోతిస్స్వరూపుఁడగు భీమేశ్వరస్వామిని గొలుచు మహేశ్వరభక్తునకు ముక్తికి లోప మేముండును ?

సీ. నేదిష్ఠమున సప్తగోదావరంబున
నఘమర్షణస్నాన మాచరించి
త్ర్యాయుషమంత్రాక్షరాభిమంత్రితమైన
విమలభూతి త్రిపుండ్రముగ ధరించి
మొగలివాకిలిఁ దూఱి దిగువశాక్వరరాజు
నగరిపై విఘ్నుని నను(?)వుఁ జూచి
మణిశిలాసోపాన మధ్యమార్గంబుగా
నభ్రంకషంబైన హర్మ్య మెక్కి

సప్తపాతాళభువన విష్కంభములను
దెఱచి వెడలిన జ్యోతిః ప్రదీప్తమూర్తి
శంభు భీమేశ్వరేశ్వర స్వామిఁ గొలుచు
పరమ మాహేశ్వరున కేమి బ్రాఁతి ముక్తి.

భీమ. ౧-౧౧౪

ఈ పద్యమున శ్రీనాథునకు భీమనాథునియెడఁ గలభక్తి తాత్పర్యములు, వ్యక్తములగుచున్నవి ప్రథమాశ్వాసములోని పద్యము లన్నియు శ్రీనాథుఁడు మూలానుసరణము లేకుండ స్వయముగ ననుసంధానించినవి. ఈ పద్యమున మాహేశ్వరుఁడు భీమేశ్వరు నెట్లు గొలువవలయునో యా తీరునుగూడ వివరించినాఁడు.

అగస్త్యుఁడు వ్యాసునితోఁగూడి భీమేశ్వరాలయమును బ్రవేశించె నని తెలుపుచు, నా దేవాలయప్రవేశమునఁ గ్రమముగ సేయే దేవతల నెట్లు సంభావింపవలయునో యను క్రమము నుగ్గడించుటయు హృద్యముగనే యున్నది. అగస్త్యవ్యాసులు అంతర్భవనమునఁ బ్రదక్షిణ మాచరించుచు తిరుచుట్టు మాలికయందు నెలకొనియున్న హిమవద్భూధరరాజతనయయగు భీమనాథునియంతఃపురాంగనను సేవించి, ఢుంఠివిఘ్నేశ్వరుని గొలిచి, దుర్గామహాదేవికి నమస్కరించి, వటుకభైరవుని జూచి, విష్ణునకు, బ్రహ్మకు, ఇతర దేవతలకు నమస్కృతులు ఘటించి భీమనాథుని దర్శించుటకై హర్మ్యము నెక్కిరఁట. ఈ పరివార దేవత లందఱును క్రింది యావరణలో నుండినవారే. వారిని దర్శించిన వెనుక భీమనాథుని దర్శింపవలయు ననుటయు నిందు వ్యక్తమగుచున్నది.

సీ. వణఁకు గుబ్బలరాచవారి కూఁతిమికన్య
భీమయ్యశుద్ధాంతభామఁ గొలిచి
కంధరంబునమండి గంధసింధురమైన
గుజ్జువేల్పుఁ గుమారగురునిఁ గొలిచి
కైవల్యనిధికి దుర్గామహాదేవికి
సర్వమంగళకు నంజలి ఘటించి
యాశాతటీపటలీ శాటికాకటు
వటుకభైరవు నిష్టవరదుఁ జూచి
నలువ సేవించి యిందిరానాథుఁ గాంచి
యితరపరివారదేవతావితతి కెల్ల
నేటికోళ్ళిచ్చి యెక్కి రమ్మేటిమునులు
మృడుని హాటకశైలంబు మీఁదినిలువు.

అగస్త్యుఁడు వ్యాసునితో దక్షారామమునందలి విశిష్టతను గూర్చి తెలుపుచు, కార్తికశుద్ధపూర్ణిమనాఁడు భీమనాథుని యాలయ ముమ్రోల వెలిఁగెడి జ్వాలాతోరణము క్రిందినుండి యొకమాఱు దూఱినచో నాతనికి ప్రాణమును విడుచుసమయమున యమపురద్వారమును దూఱునక్కఱ యుండదని వక్కాణించి యున్నాఁడు.

గీ. కార్తికికవేళ భీమశంకరునినగరఁ
దూఱు నెవ్వాఁడు చిచ్చుఁబఱతోరణంబు
నతఁడు దూఱఁడు ప్రాణనిర్యాణవేళ
ఘోరయమపట్టణ ద్వారతోరణంబు.

ఈ జ్వాలాతోరణమహోత్సవము నేటికిని భీమనాథుని యాలయము మ్రోల జరుగుచుండును. ఎందఱో భక్తులు భీమనాథుఁడా జ్వాలాతోరణమును దూఱునపుడు భక్తితోఁ దామును దూఱుచుందురు. ఆ తోరణమునకై కూర్చిన గడ్డిని దెచ్చుకొని పశువులకుఁ దినిపించిన పాడిపంటలు సమృద్ధిగ నుండునను నమ్మకముతో పెక్కుఱు హాలికులుకూడ నీ యుత్సవమునఁ బాల్గొనుచుందురు.

సప్తగోదావరమున స్నానముచేసి, భీమేశ్వరుని యాలయము మీఁది పసిఁడికలశమును గాంచి, పంచాక్షరీమంత్రమును బఠించు శివయోగికి సంసారపు జంజాటము మరలఁ గలుగదని వివరించియున్నాఁడు.

ఉ. ఏట మునింగి లేచి పరమేశ్వరుమందిర సౌధవాటికా
హాటకకుంభముంగని షడక్షరమంత్రము జిహ్వఁ గూర్చి వా
చాటత సత్యతత్త్వుఁడగు శాంభవయోగివరేణ్యుఁ డేల జం
జాటపు సంసృతిం బొరలి చచ్చుచుఁ బుట్టుచునుండుఁ బార్వతీ.

౩.-౨౩.

వసంతోత్సవము

భీమనాథుఁడు, దక్షారామమున నెలకొని భీమమండలిని నిరాతంకముగఁ బాలించుచుండఁగా నరుదెంచిన వసంతసమయమున వసంతోత్సవము వైభవముతో జరిపించెనని మహోల్లాసముతోఁ జిత్రించి

యున్నాఁడు. వసంతోదయమైనంతనే ఋతుచక్రవర్తి, భీమేశ్వరునకు కుసుమవిసరము కానుకఁ గొని తెచ్చెనఁట. దక్షారామమధ్యమున విసరిన వాయువు లెంతయు నామోదభరము వెదచల్లినవఁట. ఏతావునంద్రైనను శ్రీనాథునికంటమున గాలులు రేఁగెనా యవి వింతయొయ్యారము సూపుచుఁ గొనసాగును. అందును వసంతసమయమైనచోఁ జెప్పనేల !

శా. హేమంతావధిసంప్రబోధగురువుల్ హృజ్జాతతేజోఽగ్నిధా
య్యామంత్రాక్షరముల్ పటీరగిరి వన్యామందవాతూలముల్
వేమారుం గలశీతనూభవవధూవేణీభరాంతఃప్రసూ
నామోదగ్రహయాళువుల్ పొలసె దక్షారామమధ్యంబునన్.

ఈపద్యమున మలయగిరి మందమారుతముల నెంతయుఁ బ్రౌఢముగఁ జిత్రించుచుఁ దనకుఁగల సంస్కృతవాణీప్రయోగలాఘవమును బ్రదర్శించియున్నాఁడు. మలయగిరిమీఁది వనసమూహము నుండి బయలుదేఱిన మందమారుతములు హేమంతసమయావధిని బోధించు గురువులై మన్మథాగ్నిని ప్రజ్వలింపఁజేయు సామిధేనీ మంత్రాక్షరములై, అగస్త్యుని రాణియగు లోపాముద్ర వేణీభారములోఁ జొనిపిన పూలతావిని గొనివచ్చు నిచ్ఛగలవై దక్షారామమధ్యంబున వీచినవఁట. ఈ పద్యములో నాతఁడుపయోగించిన పదములు ధాయ్యా, వన్యా, గ్రహయాళువు అనునవి సంస్కృతభాషలో మాత్రుమూలవి. 'ధాయ్యా' అనఁగా అగ్నిహోత్రుని ప్రజ్వలింపఁజేయుటకై యజ్ఞములందుఁ బఠించు మంత్రము. దీనినే సామిధేనీమంత్రమనియు నందురు. అమరసింహుఁడు ఈ పదమునకు వివరణము నిట్లు చేసియున్నాఁడు. "సా సామిధేనీ ధాయ్యా ఋక్ యాస్యా దగ్నిసమింధనే" అనఁగా అగ్నిని మండింపఁజేయు ఋఙ్మంత్రము 'ధాయ్యా' యనియు సామిధేని యనియు ననఁబడును. దీని యర్థమును దెలిసికొనవలయునన్న శ్రౌతసంప్రదాయమేనిఁ దెలియవలెను. లేకున్న సమరము నెనురునకైన వచ్చియుండవలయును. 'వన్యా' యనఁగా వనసమూహము. 'గ్రహయాళువులు' గ్రహించెడి స్వభావముగలవి. ఈ రెండుపదముల యర్థమును గుర్తించుటకు సంస్కృతవ్యాకరణపరిపాటిని ప్రకృతి

ప్రత్యయ విభాగము దెలియుట యావశ్యకము. ఇఁక నీపద్యములో భావగర్భితముగఁ బ్రవేశపెట్టిన యంశము ఆమందమారుతములు వేమాఱుం గలశీతనూభవ వధూవేణీభరాంతః ప్రసూనామోదగ్రహణాళువు లగుట. కుంభసంభవుని భార్యయగు లోపాముద్రాదేవి కొప్పులోపల నుండిన పూవుల పరిమళములను గ్రహించు స్వభావముగలవానినిగాఁ గాలులను జేసి, లోపాముద్రకుఁగల ప్రసూనధారణప్రీతిని సాకూతముగ కవి వెల్లడించినాఁడు. లోపాముద్రకు పూవు లన్న మిక్కిలియాస్థ యున్నట్టు లీక్రిందివిషయము స్పష్టముచేయుచున్నది. లోపాముద్ర కాశిలో మల్లెతీఁగలు నాఁటినట్లును, అవి పుష్పించి విశ్వేశ్వరుని పూజ కుపయోగించుచుండెనా యని యగస్త్యుఁడు వ్యాసుని క్షేమవార్తలడుగుటయు నీవిషయమున కుపోద్బలక మని తోఁచుచున్నది.

వ్యాసుఁడు, విశ్వనాథుని యాగ్రహమునకుఁ బాత్రుఁడై కాశిని బాసి దక్షిణకాశియగు దక్షారామమునకు వచ్చుచు మార్గమధ్యమున తుల్యభాగానదీతీరమున పీఠాపుర యాత్రకుఁ బోవుచున్న యగస్త్య మహర్షిని జూచెను. అగస్త్యుఁడు వ్యాసుని యోగక్షేమములు దెలిసికొను సందర్భములో లోపాముద్ర కాశిలో నాఁటినమల్లీవల్లులను గూర్చి యిట్లు ప్రశ్నించెను.

క. కాశీనందన కంతే
కాలుల శిరములకు విరులు కల్పించునొకో
లీలావనాంతరమునను
మాలోపాముద్ర యిడిన మల్లీవల్లుల్.

ఇది లోపాముద్రకుఁ గల సుమనోవినోదమును దెలియఁజేయుచున్నది. తనయిల్లాలు వారణాసిలో నాఁటిన మల్లెల యేపునుగూర్చి ప్రశ్నించినయగస్త్యునకుఁగూడ నా పూవులమీఁద నాదర మెంతగలదో యీ పద్యము చాటుచున్నది. ఈ విషయము నంతటిని స్మరింపఁ జేయుటకే శ్రీనాథుఁడు దక్షారామమునందలి వాయువులను 'కలశీత

నూభవ వధూవేణీభరాంతః ప్రసూనగ్రహయాళువు' లనగా నవ కూర్చియున్నాఁడు.

మఱియు నిచట వీచిన మలయగిరి వాయువులకు ముఖ్యముగ నుండవలసిన శైత్యము (చల్లఁదనము) మాంద్యము (మెల్లఁదనము) సౌరభ్యము (పరిమళము) కూడియుండెననుటకే యీపద్యము కొంత తోడిగినది. హేమంతకాలావధిని దెలుపు గురువులగుటచే నీవాయువులు వేఁడిమి లేక చల్లఁదనము వహించియుండె నని తెలియుచున్నది. మలయగిరి మీఁది వనసమూహమును దట్టి వచ్చుటచేత నే యవి మంద మారుతము లయినవి. ఇఁకలోపాముద్రాదేవి కొప్పులోనికిఁ జొచ్చి యచటి పూలతావిని గొనివచ్చుటచే మారుతముల కొక విశిష్టమైన పరిమళము చేకుఱినది. ఇట్టి విశిష్టగుణములు గలిగిన మందమారుత ములు దక్షారామమధ్యంబునఁ బొలిసినవి; గావుననే యవి మన్మథాగ్ని నుజ్వలింపఁ జేయుటకు సామిధేనీ మంత్రాక్షరములుగా శ్రీనాథుని గంటమున వెలసినవి.

ఆవసంతోదయమున లతలన్నియుఁ బుష్పించినవి. తుమ్మెదలు చెలరేఁగి ఝుంకారములు చేయఁదొడఁగినవి. అచ్చరలు మందార ద్రుమవాటిలో పూలమద్యములు గ్రోలుచు త్రిలోకాధిపతియగు భీమ నాథుని హిందోళమునఁ బాడిరఁట. మన్మథుని మూలసైన్యము దండెత్తు టను దలఁపించుచు, తుమ్మెదల కోలాహలములు, చిలుకపలుకుల యుద్రేకములు, గోరవంకల సల్లాపములు, ఉద్యానవనములలో గండు కోయిలల కంఠములనుండి వెడలిన కోమలకుహూకారములును జత గూడినవి. శ్రీనాథుఁ డేవనములలోఁ బడినను కలపుంస్కోకిలకంఠ కోమల కుహూకారములను వినిపింపఁ జేయక మానఁడు.

ఆవసంతసమయమున దక్షవాటికలో నచ్చరలు వారుణీరసా స్వాదమున మత్తిలి వీణలు మీఁటుచుఁ బాడిరఁట. అదియాతని నాఁట జాతరలలోఁ గానవచ్చు పరిపాటి.

ఉ జాదుర జాదురంచు మృదుచర్చర గీతులు వారుణీరసా
స్వాదమదాతిరేకములఁ జంద్రికకాయఁగ దక్షవాటికా
వేదులమీఁదఁటన్ గనకవీణలు మీటుచుఁ బాడి రచ్చరల్
మోద మెలర్పఁగా భువనమోహన విగ్రహు భీమనాథునిన్.

భీమ. ౩-౧౦౩.

ఈనాఁడును దక్షారామ పరిసరములందు గ్రామదేవతల జాతరలు జరుగుచుండును. పెక్కురు వారుణీరసాస్వాదముచేసి వివిధమయిన వాద్యములతోఁ బాటలు పాడుచుండుటయు జరుగుచుండును. శ్రీనాథుని నాఁటి యచ్చరలు భీమనాథుని సేవించెడి వారవధువులై యుండ నోపును.

అంతట భీమనాథుఁడు కేళీవిహారముల కందఱకు నాజ్ఞ పాటించి యందులకు వలయు గంధకర్పూరకస్తూరికాది ప్రశస్తవస్తువుల నొసఁగె నఁట. వానిని గైకొని వేషభూషాదులతోఁడఁగూడి దేవతాస్త్రీలు భీమనాథుని కొలువవచ్చిరఁట. విఘ్నేశ్వరుఁడు పాతాళభైరవుఁడు వీరభద్రుఁడు బ్రహ్మాదిదేవతలు ఇంద్రాది దిక్పాలురు ప్రమథులు దేవతాగణంబులును గూడవచ్చి యాయుత్సవమునఁ బాల్గొనిరఁట. భీమనాథుఁడు వచ్చినవారినందఱను సౌహార్దముతోఁ జూచి కనుసన్నచేసినంతనే, యచటఁ జేరిన వారందఱును వావివరుసలనుబట్టి స్త్రీపురుషు లొండొరులపై గంధము పసుపు కస్తూరి కర్పూరము మున్నగు ద్రవ్యములు గలిపిన జలములు చల్లుకొనఁదొడఁగి రని శ్రీనాథుఁడిట్లు చిత్రించియున్నాఁడు.

సీ. హేరాళముగఁ జల్లె నెలనాగ యొకర్తు
కుంభోదరునిమీఁదఁ గుసుమరజముఁ
గుటిలకుంతల భృంగిరిటి మోమునం దొర్త్తు
తాకించె నోలగందంపుఁ బసుపు
వక్షంబు లక్షించి వైచె గందపుటుండ
వీరభద్రునినొక్క నీరజాక్షి
చెవిలోనఁ బాఱంగఁజిమ్మె గొజ్జఁగనీటఁ
గాలభైరవు నొక్క కలువకంటి

కొమ్మ యందంద నొక్కతె కొమరసామి
దూదలలయందు జవ్వాదినుసలు గలిపెఁ
బునుఁగు మణికుంభమున నించి పోసె నొకతె
పొలఁతి విఘ్నేశ్వరునికుండ బొజ్జమీఁద.

ఈవిఘ్నేశ్వరుని మండూకజఠరుఁ డందురు. ఈగజాననుఁ డీనాఁడు భీమేశ్వరాలయమున దక్షిణద్వారముముంగలివాకిట నున్నాఁడు.

శ్రీనాథుని కాలమునాఁటను వసంతోత్సవములలో విలువగల యీసుగంధద్రవ్యములు గలిపిననీటి నొకరిపై నొకరు చల్లుకొనుట యుండవచ్చును. ఈనాఁడును దక్షారామసమీపప్రదేశములలో దేవతాకల్యాణములు జరుగునపుడు పసుపుకుంకుమము గందము కలిపిననీటిని స్త్రీపురుషు లొండొరులపైఁ జల్లుకొను పరిపాటి గలదు. వీరిలో పురుషు లెవ్వరేని యుద్రేకముతోఁ జిమ్మటగొట్టము చేకొని నీరును జిమ్ముచు వచ్చిన నాయుత్సవములలోఁ బాల్గొను వనితలు తప్పుకొనిపోవుటయుఁ గానవచ్చును. ఆదృశ్యమును శ్రీనాథుఁడు దక్షవాటిలోఁ గాన్పింపఁ జేసినాఁడు.

ఘుట్టతరోద్ధతిం గరిముఖంబునఁ బీలిచి గౌతమీనదిం
బుట్టిన సత్ప్రవాహజలపూరముఁ గ్రుస్సన నూఁదుచుం బురీ
హట్టమున న్మహోత్సవవిహారము సల్పెను గౌరిదేవితో
ల్పుట్టి గణేశ్వరుండు సురభామిను లోలమునం దొదుంగఁగన్.

విఘ్నేశ్వరుఁ డుద్రేకముమీఱఁ దుండముతో గౌతమీనదీజలము పీల్చి క్రుస్సుమనియూఁదుచు వీథిలో విహారముచేయుచుండఁగా దేవతాస్త్రీలు చాటున కొదిగిరఁట. అట్టివసంతోత్సవసమయములలో సాధారణముగ వావివరుసలుగలవారిమీఁదనే చల్లుట పరిపాటి. ఆవిషయమునే శ్రీనాథుఁడు క్రిందిపద్యమునఁ దెలిపినాఁడు.

అచ్యుతునిమీఁద జల్లె దుగ్ధాబ్ధికన్య
భారతీదేవి పద్మజుపైనిఁ జల్లె
శచి మహేంద్రునిఁ జల్లె వసంతకేలి
గంధకర్పూర కస్తూరికాజలంబు.

దక్షారామమునందలి మహోత్సవసమయములలో సాని యీశాని వేషము దాల్చి, చేత చంద్రకాంతపాత్రి ధరించి భిక్షాటనము సేయు వేళలఁ జూపించు నృత్యము లోకముల మత్తిల్లఁ జేయునఁట. ఆ సానివేషమును శ్రీనాథుఁ డెంతయుఁ జిత్రముగఁ జిత్రించియున్నాఁడు. పూలదండలతో నిండిన వేణీభరము పొంకముగాఁ బిరుదులపైఁ బొరలియాడినది. కాలిని దొడిగినయందెల ఝుణత్కారము వ్రేళ్లకుఁ బెట్టిన మట్టెల చప్పుడుతోఁ గూడి యింపునింపినది. అందమై కుదురునిండిన పయోధరములమీఁద ముత్యాలపేటలు మురిసియాడినవి. చెవుల వ్రేలాడు తాటంకముల వజ్రకాంతులు లేఁతవెన్నెలను క్రిందుచేసినవి. ఇట్టి యపురూపమైన విలాసములతోఁ గూడిన వారవనితలు నృత్యములు సేయు పరిపాటిని శ్రీనాథునినోట వినకుండ నుత్సవ మెట్లు సాఁగును. ఆకవి నోట వినవచ్చిన సొంపుఁ బరికింతము.

సీ. విరులగండలతోడి వేణికాభారంబు
పొంకంబు పిఱుఁదులఁ బొరలియాడ
మణితులా కోటికోమల ఝుణత్కారంబు
రవలి మట్టెలమ్రోఁత యవఘళింపఁ
గుదురునిండిన చిన్ని గుబ్బచన్నుల మీఁద
ముత్యాలత్రిసరంబు మురువుఁ జూప
వలమాన తాటంక వజ్రాంకురచ్ఛాయ
లేఁతవెన్నెలఁ బుక్కిలించి యుమియ
సాని యీశానియై మహోత్సవమునందుఁ
గేల నవచంద్రకాంతంపు గిన్నెఁ బూని
వీథి భిక్షాటన మొనర్చు వేళఁ జేయు
మరుల నృత్యంబు జగముల మరులుగొలుపు. భీమ. ౧-౧౦౮

శ్రీనాథునకు దక్షారామమున నిట్టి వేశ్యాంగనా నృత్యము లానాఁడు గానవచ్చి యుండును. దాని నీ పద్యమునఁ దాను మరులు (మోహము) గొని జగములు మరులుగొనునని యతిశయింపఁ జేసినాఁడు.

వాచ్యార్థమునందు విధినిషేధాదు లుండును. ఈవిధినిషేధములే కావ్యాభిధేయములైనపుడుగాని, యనుమేయములైనపుడుగాని కలుగు చమత్కార, మివి, వాచ్యములైనపుడు కల్గదు. ఇది యర్థములకుఁ గల స్వభావమేగాని యితరముగాదు.

కాక్వభిధేయమగు నర్థమున కుదాహరణము.

మథ్నామి కౌరవశతం సమరే న కోపాత్ దుశ్శాసనస్య రుధిరం న పిబా మ్యురస్తః
సంచూర్ణయామి గదయా న సుయోధనోరూ సన్ధిం కరోతు భవతాం నృపతిః పణేన,

వేణీసంహారము.

సందర్భము:—పాండవులకును గౌరవులకును సంధి ప్రయత్నములు జరుగుచున్నవనియు, నిఁక కౌరవపాండవుల వైరము సమసిపోవు ననియు నర్థమునిచ్చు వాక్యములను విని, కోపించిన, భీముఁడు, సహదేవునితో నిట్లనుచున్నాఁడు.

అర్థము:—కౌరవశతం = నూర్గురు కౌరవులను, సమరే = యుద్ధమునందు, కోపాత్ = కోపమువలన, న మథ్నామి = మథింపను; దుశ్శాసనస్య = దుశ్శాసనునియొక్క, ఉరస్తః = వక్షస్థలమునుండి, రుధిరం = రక్తమును, న పిబామి = త్రాగను. గదయా = గదతో. సుయోధనోరూ = దుర్యోధనుని తొడలను, న సంచూర్ణయామి చూర్ణముసేయను భవతాం = మీయొక్క. నృపతిః = ప్రభువగు ధర్మజుఁడు, పణేన = ఆయి దూర్పెడు పణముతో సంధిం కరోతు = సంధిఁజేయుగాక.

ఇచటవాచ్యమగు నర్థము "నేనుమథింపను; రక్తమును ద్రాగను మొదలగు వాచ్యార్థములన్నియు నిషేధరూపముగ నున్నది. కాని యిచట "నమథామి" మథింపను మొదలగుశబ్దములను కాకుస్వరముతో నుచ్చరింపవలయును. అపుడు వాచ్యార్థమునకు విపరీతముగ "నేను మథింతును" అను నర్థముస్ఫురించును.—ఇట్లుకాకుస్వరమువలన స్ఫురించునపుడే యీవిధిరూపముగనున్న యర్థము చమత్కారావహముగ నుండును. అట్లుగాక "కౌరవశతం సమరే కోపాత్ మథ్నామి" యని కేవలము విధిరూపార్థము వాచ్యమైనపుడీ చమత్కారము గలుగదు.

మఱియొక యుదాహరణము.

లాక్షాగృహానల విషాన్న సభాప్రవేశైః ప్రాణేషు విత్తనిచయేషు చ నః ప్రహృత్య
ఆకృష్టపాండవవధూపరిధానకేశాః స్వస్థా భవంతు మయి జీవతి ధార్తరాష్ట్రాః

సందర్భము:—కురురాజసుతులు సభృత్యులు స్వస్థలగుదురుగాక" యను రెండర్థములనిచ్చు వాక్యమును విన్న భీముని పలుకులివి.

అర్థము:—లాక్షాగృహానల విషాన్న సభాప్రవేశైః = లక్క యిల్లు కాల్చుట, విషాన్నముఁదినిపించుట. ద్యూతసభయందుఁ బ్రవేశపెట్టుట మొదలగువాని చేత నః = మా

యొక్క, ప్రాణేషు=ప్రాణముల యందును, విత్తనిచయేషు చ = సంపదల యందును, ప్రహృత్య = కొట్టి [అనగా మమ్ముల నన్నివిధముల నాశనము చేసి యనియర్థము] ఆకృష్టపాండవవధూపరిధానకేశాః = ద్రౌపదియొక్క వస్త్రముల నపహరించి, యామె కేశములను పట్టిలాగిన. ధార్తరాష్ట్రాః = కౌరవులు మయిజీవతి = నేను బ్రతికి యుండగనే, స్వస్థాః భవన్తు = క్షేమముగ నుందురు గాక !

స్వస్థా భవన్తు మయిజీవతి ధార్తరాష్ట్రాః" యను వాక్యమును కాకుస్వరముతోఁ జదివినచోఁ గౌరవులు జీవింపరు అనునర్థము సిద్ధించును. నిషేధరూపమైన యీయర్థము కాకుస్వరలభ్యము. ఇదియే శబ్దవాచ్యమైనపు డీ చమత్కారము నీయదు.

రెండు ప్రతిషేధములచే ననుమితమైనపుడు విధేయార్థమునకుఁ గల చమత్కారము, స్వశబ్దవాచ్యమైనపుడు గలుగదు. ప్రతిషేధము రెండు విధములు-(1) సుబన్త విషయము, (2) తిఙన్త విషయము. ప్రతిషేధద్వయానుమితమైన విధిరూపార్థమున కుదాహరణము.

"అథాంగరాజాదవతార్య చక్షుర్యాతేతి జన్యామవదత్ కుమారీ
నాసౌ న కామ్యో న చ వేద సమ్యక్ ద్రష్టుం న సా భిన్నరుచిర్హి లోకః"
[రఘువంశము.]

ఇందుమతీ స్వయంవరము సందర్భము—

అర్థము:—అథ=అటుతరువాత. (అంగదేశపురాజును చూచినతరువాత) సా=ఆ యిన్దుమతి, అంగరాజాత్=అంగదేశపు రాజునుండి, చక్షుః=కన్ను, అవతార్య=తొలగించి. యాత = కదలుము, ఇతి = అని, జన్యాం = సఖియగు నిన్దుమతిని. అవదత్ = పలికెను. అసౌ = అంగాధిపతి. న కామ్యః = కోరదగనివాడు, న = కాదు. (అని) న = కాదు- సా = ఆ యిన్దుమతి, సమ్యక్ = బాగుగా. ద్రష్టుం చూచుటకు (తెలిసికొనుటకు) న వేద (ఇతి) న = తెలియనిదనియును గాదు— (మఱియును- లోకః=లోకము, భిన్నరుచిః = భిన్నమైన కోరికలు గలదిగ నుండును-(ఒకరికి రుచించిన వస్తువు మఱియొకరికి రుచింపదు)

సంభావ్యమైన (ఊహింపనైన) నిషేధమును, నివర్తింపఁ జేయుటయే, ప్రతిషేధద్వయమున కర్థము. ఇచట "అసౌ నకామ్యః న"- అనునపుడు నిషేధవాచకములగు "నఞ్" శబ్దములు రెండున్నవి. వీని వలన "ఇతడు కామ్యుడే" యను విధి రూపార్థమే యనుమేయమగును. ఇది "కామ్య" అనునది సుబన్తమగుటచే (నామము) సుబన్త విషయమైనది. అటులే "న, వేద, న" యనునపుడు, "వేద" యనునది తిఙన్త (క్రియ)మగుటచే, తిఙన్త విషయక ప్రతిషేధద్వయానుమితమగు విధి రూపార్థమునకిది యుదాహరణమైనది.

వ్యక్తివివేకము

భాగవతుల కుటుంబరాయశాస్త్రి, ఎం. ఏ.,

ధ్వనికర్త యిట్లు తెల్పినాడు:—"సారరూపమగు నర్థము, స్వశబ్ద వాచ్యము గాకయే, ప్రకాశితమైనపు డధికముగ శోభనొందును. సహృదయసమాజములయం దభిమతతరమగు వస్తువు, వాచ్యముగఁ గాక వ్యంగ్యముగనే ప్రకాశింపఁబడు నను విషయము సుప్రసిద్ధమే."

ధ్వనికర్త మతమునను సరించి, ధ్వనులని వ్యవహరింపఁబడు వానిలో మొకటి రెండునగు వస్త్వలంకారధ్వనులలో వాచ్యము వ్యంగ్యము నను నర్థములయొక్క (వ్యక్తికర్తమతము ననుసరించి సాధ్యము సాధనమునను వానికి) ప్రతీతియందుగల క్రమము బాగుగఁ గన్పడుచునే యున్నది. ఈ విషయమున భ్రాంతియనునదియే లేదు. అందుచే నీరెంటి విషయమునను "వ్యంగ్య" మని వ్యవహరించుట కాధారమే లేదు. వాచ్యమగు వాక్యార్థమునందు సాధ్యసాధన ప్రతీతులకుఁ గ్రమము కన్పడుచుండుటచే వ్యంగవ్యవహారము లేనట్లే, యిచటఁగూడ వస్త్వలంకారములకు వ్యంగ్యవ్యవహారముండదు.

ఇట్లు క్రమము, బాగుగఁ గన్పడుచుండుటచేతనే, శ్రూయమాణములై, ధ్వనియని వ్యవహరింపఁబడుచున్న (వ్యంజకములని యనబడుచున్న) శబ్దములకును, వాని యందుండి, స్ఫోటమని పిలువఁబడుచున్న (వ్యంగ్యము) యర్థమునకును, వ్యంగ్యవ్యంజకభావము కుదురకుండుటచే వ్యంజకత్వమను సామ్యము నాశ్రయించి (గమ్యము, గమకమునకు సమాన ధర్మముండుటచే) శబ్దార్థోభయరూపమైన కావ్యమునకు ధ్వనియను నామకరణము చేయుటయు ననుపపన్నమే. ఇచటఁగూడ వీనికి శబ్దార్థములకు, వ్యంగ్యవ్యంజకము లనఁబడు వానికిఁ గార్యకారణభావమూలమైన గమ్యగమకభావమున్నది. కార్యకారణభావ మున్నపుడెల్ల క్రమము సులక్ష్యమే. అగునపుడు, సహభావముండుట కుదురదు. సహభావము లేనపుడు, వ్యంగ్యవ్యంజకభావముండుట యుక్తిసిద్ధము కాదు. కావున వస్త్వలంకార ధ్వను లను వ్యవహారమే నిర్మూలమని తెలియవలెను.

ప్రశ్న.

విభావాదిప్రతిపాదకమగు వాక్యార్థము భాసించుకాలముననే రతి, హాసము మొదలగు స్థాయిభావములప్రతీతియును గల్గుననుట యందఱకును నిశ్చయాత్మకముగఁ దెలిసినదియే. విభావాదివాక్యార్థ ప్రతీతికిని, రత్యాదిభావ ప్రతీతికిని మధ్యవానికిఁగల కార్యకారణభావాది రూపమగు సంబంధమును స్మరించుట మొదలగు విఘ్నము లున్నవని యెవరు ననుకొనుటలేదు. రెండు ప్రతీతులకును మధ్య వ్యవధానమను నదియే లేదే.

రత్యాది ప్రతీతియే రసాది ప్రతీతియగుటచే, నచట వ్యంగ్యవ్యంజక భావము ముఖ్యార్థమునందే కుదురును. ప్రదీపఘటములకు వలె నిచటఁగూడ గమ్యగమకభావ ముపపన్నమగును. ఈ విషయమును ధ్వనికర్తయే తెల్పినాడు.

"వ్యంజకత్వ మార్గమునందన్నచో, యొక యర్థము, మఱియొక యర్థమును బ్రకాశింపఁజేయునపుడు, ప్రకాశమగు వస్తువు, తనరూపమును బ్రకాశింపఁజేసికొనుచునే మరియొక వస్తువునుఁగూడ ప్రకాశింపఁజేయును- దీపమే యిందులకు దృష్టాంతము.*

కావ్యమునందుఁ గూడ నీక్రింది వాక్యార్థమే యుదాహరణమగును. "లీలాకమల పత్రాణి గణయామాస పార్వతీ" ఇచట నాకారగోపనమను లక్షణముగల "యవహిత్థ" మనుభావము వ్యంగ్యము. లీలాకమల పత్రగణనము వ్యంజకము. ఇందు వ్యంజకము భాసించుచునే వ్యంగ్యార్థమును భాసింపఁజేయును.

---

*లక్షణావ్యాపారమునకును, వ్యంజనా వ్యాపారమునకును భేదముఁదెల్పు సందర్భమున నీవాక్యము లున్నవి. లక్షణయందు, వాచ్యార్థమే తనను లక్ష్యార్థముగ మార్చుకొనును, ఉదా:—గంగాయాం ఘోషః అనునపుడు గంగాశబ్దమునకు గల ప్రవాహరూపమగు వాచ్యార్థమే, గంగాతీరరూప లక్ష్యార్థముగ మారును. లక్ష్య లక్షకములకు భేదము గన్పడదు. వ్యంజక స్థలమున నట్లుగాదు. ప్రదీపమే ఘటముగాదుగదా యని భావము.

(వ్యంగ్య వంజకములు రెండుగా సమకాలముననే ప్రతీయమాన ములగును. ఇట్లులక్ష్యలక్షకములు విభిన్నములుగఁగన్పడవని భావము) ధ్వనికర్తయే తెల్పిన మరియొక ప్రమాణవాక్యమును గూడనిచ్చుచున్నాము. వ్యంగ్యార్థము భాసించునపుడు, వాచ్యార్థజ్ఞానము పోదు. వాచ్యార్థముతో నవినాభావము గల్గియే యది ప్రకాశించును. అందుచే నారెంటికిని ఘటప్రదీపన్యాయ ముపపన్నమగును. ప్రదీపసాహాయ్యమున ఘటప్రతీతి కల్గినతరువాత, ప్రదీపప్రకాశము పోనట్లే, వ్యంగప్రతీతికాలమునందును వాచ్యార్థప్రతీతి పోదు. (అందుచే వాచ్యవ్యంగ్యములకు నిమిత్తనిమిత్తి భావములేదని ధ్వనికర్తమతము.)

సమాధానము.

వాచ్యప్రతీయమానార్థములు క్రమముగనే భాసించునుగాని సమకాలమున భాసింపవు. వాచ్యవ్యంగములకు గమ్యగమకభావమున్నది- అను నీవిషయమును ధ్వనికర్తయు వ్యంగ్యవ్యంజక స్వరూపమును నిరూపించునపుడు తెల్పియేయున్నాడు. ఆయన తెల్పిన విషయమునే మేమిచటఁ బైబ్రశ్నలకు సమాధానముగ నిచ్చుచున్నాము.

"విభావానుభావవ్యభిచార భావములే రసమని యొకరి మతము గాదు. అందువలననే రసాదిప్రతీతి, విభావాదిప్రతీత్యవినాభావిని యగుటచే నారెంటికిని కార్యకారణ భావముంటువలనఁ గ్రమముఁ గూడనున్నదని యవశ్య మంగీకరింపవలెను. అయినను ఆక్రమము చాలశీఘ్రము మైనదగుటచేఁ గన్పడదు. కావున, నలక్ష్యక్రమము లయియే, రసాదులు వ్యంగ్యములని చెప్పితిమి."

ధ్వనికర్తయే తిరిగి యిట్లుగూడఁజెప్పినాఁడు- "అందువలన నభిధాన ప్రతీతికిని, నభిదేయ ప్రతీతికిని నిమిత్త నిమిత్తిభావ మున్నట్లే వాచ్యార్థ ప్రతీతికిని వ్యంగ్యార్థ ప్రతీతికినిఁ గూడ నిమిత్తనిమిత్తిభావ

ముండును, నిమిత్తనిమిత్తిభావ ముండుటచే వానికిఁ గ్రమముగూడ నవశ్య ముండవలయును. కాని, పూర్వము చెప్పిన క్రమము ననుసరించి యాక్రమ మొకచోఁ గన్పడును. మరియొకచోఁ గన్పడదు"—

వాచ్యార్థమునకును వ్యంగ్యార్థమునకును ముందుఁ దెలుపనున్న రీతిని,♦ లింగలింగి భావమున్నదని సమర్థింప వచ్చును. అందుచే ధ్వని భేదములన్నియు ననుమానమునందే యన్తర్భావము నొందును. ధ్వని కంటె ననుమానము మహావిషయమగుటయు నిందులకు హేతువు "ధ్వని"కి లక్ష్యములు కాని పర్యాయోక్తము, గుణీభూతవ్యంగ్యము సమాసోక్తి మొదలగు వానియందును ననుమానము వ్యాపించి యుండును. ఇట్లు ధ్వనికి లక్ష్యములైన వానియందును, లక్ష్యములు కాని వానియందునుఁ గూడ ననుమానము వ్యాపించి యుండుటయే యనుమానమనునది ధ్వనియను దానికంటె మహావిషయమనుటకుఁ గారణమగును.

ప్రశ్న.

అనుమాన మనునది కేవలము స్వప్రయోజనకము. అనఁగా, పర్వతముపై ధూమమునుఁ జూచి యిచట నగ్నియున్నదని యెవఁడను మానించునో, యతనికే యా జ్ఞానము కల్గును. ధ్వనివిషయమున నట్లు గాదు. రచయితకంటె భిన్నుఁడైన పాఠకునకు లేక శ్రోతకుఁగూడ నీ జ్ఞానము కలుగుచున్నదిగదా! ఇట్లు ధ్వన్యనుమానములకుఁ బరస్పరము భేదములేదా ?

సమాధానము.

సత్యమే. ధ్వనియనునది స్వప్రయోజనకము గాదు. అంత మాత్రమున మా వాదమునకు హానిలేదు. అనుమానమనునదియే

♦లింగము—హేతువు. సాధనము, లింగి—సాధ్యము.

రెండు విధములు. స్వార్థానుమానము, పరార్థానుమానము- అందు కేవలము స్వార్థానుమానమునందు వచనవ్యాపార మక్కఱలేదు. (అనఁగా శబ్దములతో రచనను జేయనక్కఱలేదు.) వచనవ్యాపార పూర్వకమగు రచన చెప్పఁదున్నదో, యప్పుడే యది పరార్థానుమానమని తెలియవలెను. పక్షసత్వము, సపక్షసత్త్వము, విపక్షవ్యావృత్తత్వము నను మూఁడు రూపములుగల లింగమును (హేతువును) శబ్దవ్యాపారపూర్వకముగఁ దెల్పుటయే పరార్థానుమానమునకు లక్షణము. ఇందువలన వచనవ్యాపారపూర్వకమగు వాఖ్యానమే (చెప్పుటయో, రచించుటయో) పరార్థానుమానమగును గాని కేవల లింగజ్ఞానము పరార్థానుమానము కాదని తెలియవలెను. తర్కశాస్త్రసంప్రదాయము దెలియనిలోక మీ విషయమును దెలిసికొనుట లేదు. అందుచే ధ్వన్యనుమానములకు భేదమును గుర్తించుటలేదు. ఇచట నీవిషయమును గుర్తింపవలయును.

తర్కశాస్త్రము ననుసరించి, అనుమానము రెండు విధములు, స్వార్థానుమానము, పరార్థానుమానము.

స్వార్థానుమానము

ఒకఁడనేక పర్యాయములు మహానసాదులయందు (వంటశాల యందు) ధూమాగ్నులు కలిసియుండుటఁ జూచి, "యత్రధూమః తత్రాగ్నిః" ఎచ్చట ధూమముండునో యచ్చట నగ్నియుండును. అని ధూమాగ్నులకు సాహచర్యనియమరూపమైన వ్యాప్తిని గ్రహించినాఁడు. అతని కా యనుభవము గల్గినదనినమాట. తరువాత నాతఁడొక పర్వతము దగ్గఱకు వెళ్ళినాఁడు. ఈ పర్వతమున నగ్నియున్నదా! యని సందేహించుచుండగా ధూమమతనికిఁ గన్పడినది. ఇప్పుడు ధూమాగ్నులకుఁ గల "వ్యాప్తి" యాతనికి జ్ఞాపకము వచ్చినది.

ఇచట నీ విషయమును గుర్తింపవలయును.

"వహ్ని వ్యాప్య ధూమవా నయం పర్వతః".

అను జ్ఞానము కలిగినది. దీనినే లింగపరామర్శమని యందురు. తరువాత "పర్వతో వహ్నిమాన్" ఈ పర్వతమునం దగ్నికలదు." అను ననుమితి కల్గును. అనగా ధూమాగ్నుల భూయోదర్శనము, ధూమాగ్నులకుఁగల వ్యాప్త్యనుభవము, పర్వతమున నగ్నిని సందేహించుట, ధూమమును జూచుట, వ్యాప్తిస్మృతి, పరామర్శము, అనుమితి" అనునవి క్రమముగ నాతని మనసునఁ గల్గును. ఇది స్వార్థానుమానరీతి.

ఇఁక స్వయముగ ధూమముండుటచే నగ్ని ననుమానించి, యితరులు గూడఁ దెలిసికొనుటకై పంచావయవమగు వాక్యమును బ్రయోగించుట యనెడిది పరార్థానుమానము. పర్వతో వహ్నిమాన్=పర్వతమునం దగ్ని యున్నది; ధూమవత్త్వాత్=పొగయుండుటవలన; యోయో ధూమవాన్ ససోఽగ్నిమాన్, యథామహానసః=ఎచటనెచట ధూమముండునో యచట నచట నగ్ని యుండును, మహానసమునందువలె; తథాచాయం; ఇచట నట్లే ధూమమున్నది. తస్మాత్తథా=అందుచే నిచట నగ్ని యున్నది. ఈ వాక్యములను బ్రయోగించుటచేత నితరునకుఁ గూడ పర్వతమున నగ్ని యున్నదని తెలిసికొనును. అందుచే నిది పరార్థానుమానము ఇందు ప్రతిజ్ఞాహేతూదాహరణోపనయన నిగమనములను నైదవయవములున్నవి. పర్వతో వహ్నిమాన్=ప్రతిజ్ఞ, ధూమవత్త్వాత్=హేతువు. యోయోధూమవాన్ ససోగ్నిమాన్ యథా మహానసః = ఉదాహరణము. తథాచాయం = ఈ పర్వతమునఁగూడ వహ్ని వ్యాప్యమగు ధూమమున్నది = ఉపనయనము తస్మాత్తథా=నిగమనము- ఇవి పంచావయవములు.

ఇందులోనే "యన్నైవంతన్నైవం యథాహ్రదః" ఎచట నిట్టి ధూమముండదో యచట నగ్ని యుండదు. సరసువలె అని విరుద్ధదృష్టాంతమును గూడఁ జెప్పుదురు.

పక్షసత్త్వము.

సందిగ్ధసాధ్యముపక్షము- ఎందు సాధ్యమైన యగ్నియున్నదా లేదాయని యనుమానించుచున్నామో యది పక్షము. ప్రస్తుతము పర్వతము- పక్షమైన పర్వతమునందు లింగమగు ధూమముండుట పక్ష సత్త్వము.

సపక్షసత్త్వము.

నిశ్చితసాధ్యవాన్ సపక్షః- అగ్నియున్నదని నిశ్చయముగఁ దెలిసినస్థలము సపక్షము- ప్రస్తుతము మహానసము- అచట ధూమముం డుట సపక్షసత్త్వము.

విపక్షవ్యావృత్తత్వము.

నిశ్చితసాధ్యాభావవాన్ విపక్షః- సాధ్యమైనయగ్ని యెచట లేదని నిశ్చయముగఁ దెలియునో యది విపక్షము- ప్రస్తుతము సరస్సు. అచ్చట నగ్నిలేదు. అగ్నిలేని యచట ధూమములేకుండుట విపక్షవ్యా వృత్తత్వము.

సద్ధేతువులకీ మూఁడురూపములగు లక్షణములు నుండవలయును. ఈ త్రిరూపలింగమును, శబ్దరూపమునఁ బ్రతిపాదించుట యెప్పుడున్నదో యపుడు పరార్థానుమానమే యగును. ఇతరులకుఁ జెప్పవలసిన యవ సరములేనపుడు శబ్దరచనమే యక్కఱలేదుగదా! కావున ధ్వనిస్థల మునఁ గూడ సాధ్యసాధనభావ మెపుడు శబ్దనిరూపితమైనదో యపుడే యది పరార్థానుమానమున నంతర్భావముఁ జెందనదనియే తెలియ వలెను. అందుచే ధ్వనిస్థలమున స్వార్థానుమానలక్షణము (స్వప్రయో జనము) లేకుండుట దోషముగాదని నిర్ణయము.

వాక్యార్థమునందంతటను సాధ్యసాధన భావము గర్భీకృతమై యుండుననియే గదా మీరుచెప్పునది. అగుచో నీవాక్యార్థములయందు

సాధ్యసాధనములు రెండునున్నట్లే, దృష్టాంతముగూడ నుండనక్కఱ లేదా? వ్యాప్తిసాధనమునకు దృష్టాంతముగూడ నవశ్యమపేక్షణీయమే గదా? కాని ప్రస్తుతము మనము బరిశీలించిన వాక్యార్థమునందు దృష్టాంతములు లేవే!

సమాధానము.

దృష్టాంత మన్ని తావుల యందు నవశ్యముండవలయు నను నియమము లేదు. ఒక్కొక విషయమును సాధించుటయందొక్కొక సాధన ముప్రసిద్ధమైయుండును. ప్రసిద్ధసామర్థ్యమగు నట్టిసాధనమును మనము గ్రహించి నపుడా సాధనముయొక్క సామర్థ్యమువలననే, సులభము గనే సాధ్యసిద్ధి కలుగును. అట్టి తావులందు దృష్టాంత గ్రహణమక్కఱ లేదు. ఈవిషయమును పూర్వులు చెప్పినారు.

"తద్భావ హేతుభావోహి దృష్టాంతే తదవేదినః
ఖ్యాప్యేతే విదుషాం వాచ్యో హేతురేవ చ కేవలః

[తదవేదినః=సాధ్యసాధన భావము తెలియని వారికి, దృష్టాంతే =దృష్టాంతమును తెల్పు వాక్యమునందు, తద్భావహేతు భావౌ=సాధ్య సాధన భావములు, ఖ్యాప్యేతే= తెలియఁ జేయబడుచున్నవి. విదుషాం= సాధ్యసాధన భావము తెలిసినవారికి, హేతురేవ కేవలః వాచ్యః= హేతువొక్క దానిని మాత్రమే చెప్పినఁజాలును.

ఇంతవఱకుఁ దేలిన దేమన ?—రసవిభావాది ప్రతీతులు సమ కాలికము లను భ్రమచేతనే, ధ్వనివాదులు వ్యంగ్యవ్యంజక భావము సంగీకరించినారు. వాస్తవమున రసవిభావాదులకు వ్యంగ్య వ్యంజక భావమనునది ఔపచారికమేగాని ముఖ్యముగాదు. ఈవిషయము నిక ముందుఁ గూడ నిరూపింతుము.

ఏకాదశ స్కంధము

— హరిభట్టారకుఁడు —

క. ఈరీతి నురులఁ జిక్కిన
దారాపత్యములఁ జూచి తత్పతి దుఃఖా
పూరితనిజమానస సం
ప్రేరితుఁడై యిట్లు పలవరింపఁ దొడంగెన్. 207

సీ. పరమపాతివ్రత్యపావనురాలైన
భార్యయుఁ బ్రాణమై పరఁగుసుతులు
నురులచేఁ జిక్కువడున్నారు, నాకింక
నెయ్యది దిక్కు, నే నెట్లునిలుతు
నొకటి విచారింప నొక కర్మ మేతెంచె
దైవికయత్నంబు దప్పదెచట
పీరలఁ బాసి నే ధీరతనెట్లుందు
దిగనాడి చనుచున్న దిటుకులుంబ

గీ. మనుచు బెగ్గిలి విరహాకులాత్ముడగుచు
బెక్కువిధముల విలపించి బీరముడిగి
పాయరానట్టి కూరిమిఁ బాయలేక
తగులువడె నందుఁ బతగంబుఁ దత్తరమున. 208

క. తగిలిన పతగంబుల నా
యగచరుఁడు వధించి చిక్కమం దిడుకొని, వాఁ
డగణిత హర్ష సముజ్జ్వలుఁ
డగుచుం జనె నిలయమునకు యదువంశనిధీ. 209

క. ఈరీతి మోహవశమున
దారాపత్యాదులందుఁ దత్పరుఁడై, స
ర్వారంభ హీనుఁడగుచును
జేరువ నరకంబులందుఁ జెందునరుండుర్. 210

క. ఏనరుఁ డైననుఁ గానీ
మానవలోకంబుఁ బొంది మతిమంతుండై
శ్రీనాథుని మదిఁ దలఁపని
యానరుఁ డారూఢపతనుఁ డనఁగాఁ బరఁగున్. 211

ఆ. పట్టె డంతయైనఁ బరిపూర్ణ మైనను
రుచివిహీనమైన రుచ్యమైన
కణఁకఁ గోర్కి లేక గ్రాసంబువచ్చిన
నజగరంబుమాడ్కి నందవలయు 212

గీ. జీవనంబుగల్గి చేవ మీఱిన వేళఁ
బూని జీవనంబు లేనివేళ
నుబ్బు స్రుక్కు లేక యుండంగవలయును
సాగరంబుమాడ్కి యోగయుతుఁడు 213

క. శలభము సంతత దీప
జ్వలనంబున సమయునట్లు వామాక్షులయు
జ్జ్వల భూషాంబర వాంఛా
కలితుండగు నరుఁడు వొందు ఘననరకంబుల్. 214

క. జవమునఁ దుమ్మెద పుష్పా
సవపానము సేయురీతి శాస్త్రాంతర సం
భవ సారములను మునిపుం
గవుఁ డాచరణంబు సేయఁ గల్గును సుఖముల్. 215

క. దారుమయనిర్మితకాంతా
కారములును ముట్టనేని ఘనుఁడగు యతి తా
నేరుపు చెడి బద్ధుండగు
గారవమునఁ గరిణిఁ జేరు కరిచందమునన్. 216

క. అధికాసవసంగ్రహమున
మధుమక్షిక మడియుకరణి మహిలో యతి దు
ర్విధమున భిక్షాసంగ్రహ
మధమంబుగఁ జేసెనేని హతపుణ్యుఁడగున్. 217

ఆ. జనులచేత దుఃఖసంచితంబైన యుప
భోగములకు రాక పోవుధనము
కూర్మి జంటెయీఁగ కూర్చుతేనెయుమాడ్కి
పొలుపుమీఱి యన్యభోగ్యమగును. 218

క. నెలకొన్న వేడ్కయతి రా
మలగీతము వినఁగవలదు మాటికి, వినినన్
దలఁపెక్కు ఋష్యశృంగుని
వలెఁ దద్గతహృదయుఁ డగుచు వర్తన విడుచున్. 219

క. గీతము చెవులకు సోకిన
చాతురిఁ దనుమఱచి మృగము సమసినకరణిన్
గీతము విని యతి తద్వశుఁ
డై తా సుజ్ఞాన మడిగి హతుఁడగు నధిపా. 220

క. రసమోహితులై మర్త్యులు
రసనాదోషంబువలన రాయిడి పడుచున్
దెసచెడి మీనంబులక్రియ
నసమాంతక పాశబద్ధులగుదురు దఱచై. 221

క. అనయము జిహ్వాచాపల
మున నింద్రియజయములేక ముక్తికిఁ బదిలం
బున జనెడి మార్గమెఱుఁగక
మనుజుఁడు సమవర్తిలోక మందువసించున్. 222

క. జిహ్వాచాపలసహితుఁడు
బహ్వాశాకలితుఁడగుచుఁ బతితుండగు, నా
జిహ్వాచాపల రహితుఁడు
బహ్వామరసమేతుఁడగుచు వడిఁ జను దివికిన్. 223

సీ. నెఱి విదేహమహావనీపురమునఁ రాజ
వీథిఁ బింగళ యను వేశ్య గలదు
తన్మూలమునఁ గొంత తత్త్వ మే నెఱిఁగితి
నా కథావృత్తాంత మాదినుండి
విస్తరంబుగ నీకు వివరించి చెప్పెద
విను మాదరంబున విమలచరిత
యా వేశ్య యొకనాఁడు భావంబులో నర్థ
సంగ్రహార్థం బాత్మసఖుని మొఱఁగి

గీ. గరిమఁ గూరిమిసల్పు వాక్యములచేత
రాకపోకల వచ్చువారల మనంబు
లందు మన్మథభావంబు లాముకొనఁగ
రమణ వర్తించె నిజమందిరంబునందు. 224

క. ధనమిచ్చువానిఁ బిలిచెద
నని రాత్రిట నిద్రమాని యా మానిని వీ
థిఁ దిరుగాడఁగ దన్మన
మున నొక నిర్వేద మొదవె ముక్తిప్రదమై. 225

వ. ఇవ్విధమున నిద్రాసుఖము పరిత్యజించి విత్తాశాపరవశయై నిశా సమయంబున రాజమార్గంబునఁ దిరుగాడుచు నధికశ్రమంబు నొందిన యావేశ్యాలలామ మానసంబున నిర్వేదంబు జనియించిన నాత్మలో నిట్లనియె. 226

క. రతిపతితోఁడుశ సరినై
రతిసేయఁగ నేర్పుగలిగి ప్రబలుండగు నా
పతిఁ గాదని, పరపురుషునిఁ
బతిగా మతిఁగోరు నాకుఁ బాపంబొదవెన్. 227

సీ. సర్వలోకేశుని సచ్చిదాకారుని
వాసుదేవుని భక్తవనజమిత్రుఁ
జింతింపనొల్లక చింతాశతంబుచే
స్రుక్కి విత్తాశచే నుక్కుమిగిలి
చర్మాస్థిరక్త మాంసావృతంబై నట్టి
కష్టదేహంబు విక్రియముసేసి
ధనసంగ్రహము సేయ మనమున నూహించి
వీథులఁ దిరుగాడి వెత్రెనైతి

గీ. సనుచుఁ బింగళ రోసి, విత్తాశ మాని
హరిఁ బరేశునిఁ జిత్తాబ్జమందునిలిపి
చారుపుష్పాభినిర్మిత శయ్యమీఁద
బ్రియునితోఁ గూడ నిద్రించెఁ బ్రేమతోడ. 228

మ. గురుసంసారమహార్ణవాంతరనిమగ్నుండై, దురాశాపరం
పరచే నష్టవిలోచనుండగుచు, నాపత్పంకసంలిప్తుఁడై
వరుసన్ గాలమహాహిజిహ్వాతుదపై వర్తించు నీ జీవునిన్
హరిదక్కన్ బరులెవ్వ రోపుదురు సత్యాచార రక్షింపఁగన్. 220

సీ. దేహంబు నిజమని తెలివితోఁ జూచిన
బుద్బుదంబులరీతిఁ బోవునడఁగి
విత్తంబు నిజమని వీక్షింప నదిమోహ
జనకమై తోఁరఁగును దనకురాక

రూపంబు నిజమని గూఢితోఁ గొనియాడ
ఘనజరాపంచాస్య బాధితంబు
సంపద నిజముగాఁ జర్చించిపలికిన
మెఱుపుచందంబున మెఱసిపోవు

గీ. అరయఁ గాంతాత్మ సంజాతులవ్వ వారు
పూర్వకర్మంబు లనుభవంబునకు రాక
మాన నేరవు గాన నీ మమత విడిచి
చింత సేయంగవలయు లక్ష్మీశపదము. 230

క. కురరంబొక్కటి మాంసము
కరమునఁ గొని మింటి నెగయఁగాఁ జూచి మదో
త్కరమై పతంగసంఘ
మ్మఱిమిఁ దన్మాంసమునకు నరిగినపిదపన్. 231

గీ. బలిమితోడ మింటఁ బఱ దెంచుపక్షుల
నీక్ష సేసి మోహమెల్లమాని
మాంస మూడఁ దన్ని మది వాంఛ సేయక
కురర మరిగె నెలవుగూఁటికడకు, 232

క. ఆకురరముచందంబున
శ్రీకాంతలయందు వాంఛ సేయక, ప్రాప్తం
బే కొలఁది నా విధంబునఁ
బోకడఁ గని నరుఁడు దృప్తిఁబొందఁగవలయున్. 233

క. మానము నవమానము సరి
గా నూహయొనర్చి యేను గతకలుషుఁడనై
పూనిక నాత్మారాముఁడ
నై నయమున సంచరింతు నర్భకుపగిదిన్. 234

సీ. ఒకనాఁడు ధరణిలో నొక విప్రకన్యక
కౌతుకంబున నింటి కావలుండి
బంధువు లేతేర భక్తితో వారల
కతిముదంబునఁ బాద్య మర్ఘ్య మొసఁగి
తద్భోజనార్థమై • తతి రాజనంబులు
వరుస దంపఁగ శంఖవలయపంక్తి
ఘల్లుఘల్లని మోయఁ గడుసిగ్గువడిఁ జేత
నొకటి నిల్పఁగఁ గైవ చియున్నదాని

గీ. వరుసతో నొక్కటొకటి వోవంగఁజేసి
యంతె నొరయిక లేనిచో నారవంబు
లణఁగిపోయిన సంతోషమగ్గలింప
దంచె రాజనములు బాలధన్యశీల. 235

ఆ. ఆ కుమారికంకణాళి చందంబునఁ
బెక్కుయుతులుఁగూడ బెనఁగు జగడ
మొక్కఁడైన మాట లుడిగి నిశ్చలచిత్త
సహితుఁడగుచుఁబొందు సత్పదంబు. 236

మ. శరకారుండు శరంబుమీఁద నిజదృక్స్వాంతంబు లేకంబుగా
నెఱి సంధించి, దదేకనిష్ఠుఁడగుచున్ వీక్షింపుచో ముందఱన్
తురగంబెక్కినరాజు గాంచినకిరియన్ దోరంబుగా మోగిబా
హ్యరుచిజ్ఞానము• మాని చేర్పవలయున్ యజ్ఞేశుపైఁజిత్తమున్.237

• తతి=ఈశబ్దమిచ్చట రహస్యము లేక యే కాంతము అనువర్థమునఁబ్రయుక్తము-మూలములో:—

తే పామధ్యవహారార్థం శాలీన్ రహసి పార్థివ! అవఘ్నంత్యాః ప్రకోష్ఠస్థాశ్చుక్రుశుః శంఖాః స్వనం మహత్.

• పాఠాంతరము—రౌతు. కాని 'రాజు' పాఠము యుక్తమని తోఁచెడిని-మూలములో యథేషుకారో నృపతిం వ్రజంత మిషౌ గతాత్మా న దదర్శ పార్శ్వే.

క. చీమలు పెట్టిన పుట్టలఁ
పాములు సుఖియించునట్లు పరమజ్ఞానుల్
ప్రేమంబునఁ బరగృహమున
వేమఱు సుఖియింతు రధిక విభవముతోడన్. 238

చ. అరయఁగఁ నూర్ణనాభిహృదయమ్మునఁదంతువి కాన మొప్పఁగా
బరువడితో రచించి యది భగ్నముసేసి గ్రహించునట్లు, వే
మరు హరి భూతపంచకసమన్వితసృష్టి సృజించి దాని సం
హరణము సేయు నంత్యమున నక్షయరోషకషాయితాత్ముఁడై. 239

ఆ. నరుఁడు కూర్మినైన నతిరోషముననైనఁ
జిత్త * మేమిటంధుఁ జేర్చునేని
నతఁడు తత్స్వరూప మగుచుండుఁ షట్పదా
క్రాంతమైన కీటకంబు కరణి. 240

వ. ఇవ్విధంబున నేను భూమివలన క్షమయును, వాయువు వలనఁ బరోప
కారంబును, ఆకాశంబువలనఁగాలసృష్టగుణాసంగమంబును, జలం
బువలన నిత్యశుచిత్వంబును, అనలంబువలన నిర్మలత్వంబును, నిశాక
రునివలన నధికాల్పసమత్వంబును, సూర్యునివలన జీవనగ్రహణ
మోక్షణంబులును, కపోతంబువలనఁబుత్రదారాదిస్నేహవిసర్జనం
బును నజగరంబువలన స్వేచ్ఛాసమాగతాహారభోజనంబును,
సముద్రంబువలన నుత్సాహశోషణపరిత్యాగంబును, శలభంబు
వలన శక్త్యనుకూలకర్మాచరణంబును, షట్పదంబువలన సార
గ్రహణ సామర్థ్యంబును, గజంబువలన కాంతావైముఖ్యంబును,
జ్ఞంటీఁగవలన సంగ్రహణార్జవంబును హరిణంబువలన నిశ్చలచిత్త
ప్రచారంబును, మీనంబువలన జిహ్వాజయంబును, పింగళవలన
యథాలాభ సంతుష్టియును, గురరంబువలన మోహత్యాగంబును

* ఏమిటంధు = ఈశబ్దము 'దేనియందైనను' అను అర్థమునఁ బ్రయుక్తము మూలములో. 'యత్ర యత్ర మనో దేహీ ధారయేత్ సకలం ధియా స్నేహాద్ద్వేషాద్భయాద్వాపి యాతి తత్తత్స్వరూపతాం'.

రమ్యాలోకనము

సముఖము వేంకట కృష్ణప్ప నాయకుని

రాధికాసాంత్వన పీఠిక

రాయలనాఁటి రసికత నాయకరాజులనాఁటికిఁ బరకోటి ముట్టినది, పతనోన్ముఖము నైనది. అప్పటి యాంధ్రప్రబంధములు శృంగార రసపుఁబసకును గనకును బరమావధు లని చెప్పవలె అట్టివానిలో సముఖము వేంకట కృష్ణప్ప నాయకుని రాధికా సాంత్వనము నొకటి. పౌరాణికప్రతిష్ఠ గల ప్రబంధనాయికలలో రసప్రసిద్ధమైన వ్యక్తిత్వము గల వారిద్దఱే రాధిక, సత్యభామ. సముఖము కృతిలో నాయిరువురు నాయికలును గలరు. రాధికది ప్రధాన భూమిక. సత్యభామ సవతి. రాయల నాఁటి ప్రబంధ రాధిక స్వీయ. సత్యభామ సరేసరి; ఎప్పుడును ఖండిత నాయికయే. అస లామె ఖండిత కాకున్నచో సొగసే లేదు. కాని దక్షిణాంధ్ర కవుల చేతిలోఁ బడఁగానే వారి వాలకములు మాఱినవి. నాటకములలో సత్యభామకును ప్రబంధములలో రాధకును ప్రాధాన్యము హెచ్చినది. రాధ పరకీయయు నైనది. పైఁగా సత్యభామ ఖండిత నాయికాత్వము నామెకు సంక్రమించినది. సంప్రదాయ సహజముగాఁ బ్రేమాభిరామములు గావలసిన యా నాయికల యాకృతు లప్పటి కృతులలోఁ గామక్రీడాభిరామము లై పోయినవి. అయినను నభిరమ్యత యన్న దొకటి మిగిలియున్నది కనుకనే వాని కావ్యత్వమున కింత నిలుకడ గలిగినది.

మన కిప్పు డుపలభ్యము లగు రాధికాసాంత్వనములు రెండు. సముఖము కృతి యొకటి, ముద్దుపళని దొకటి. ఇరువురి కవితలకును బోలిక లిరుగుపొరుగుగా నున్నవి. పద్యము లఱువది పై చిలుకు రెండింట యథాతథముగా నున్నవి.

సముఖము క్రీ. శ. 1704-1731 సం॥ ల మధ్య మధుర నేలిన విజయరంగ చొక్కనాథనాయకుని ముఖ్యసామాజికుఁడు. ముద్దుపళని క్రీ.శ. 1741-1764 సం॥ల మధ్య తంజావూరు నేలిన మహారాష్ట్ర ప్రభువు ప్రతాప సింహుని సాస్థానిని. విజయరంగని రాజ్య కాలమునకే వేంకట కృష్ణప్ప వృద్ధుడై యుండె ననుయూహకు నుపాధి గలదు. (చూ. ఆం. సా! పక్ష ప్రచురణ వచన జైమిని భారతమునకు జయంతి రామయ్యగారి భూమిక) ఎంతకాదన్నను సిరుపురకును బది పదునైదేండ్లన సంతర ముండి యుండును. అదియుఁగాక యాంధ్ర సాహిత్య పరిషత్తునఁగల సముఖము కృతి తాళపత్త్రప్రతిచివర, 'కీలక నామ సంవత్సర మార్గశీర్ష బహుళషష్ఠి శుక్రవారమునాఁడు బాగూరు రంగశాయికొమార్త అమ్మికి తంజావూరుకవి వేంకట స్వామినాయఁడు రాధికా సాంత్వనము సర్వము స్వహస్తలిఖిత ముగా నిచ్చినది', యని గలదు. ఆ కీలకనామ సంవత్సరము క్రీ.శ.1728 గా గుర్తింపబడినది. అది 1788 కావచ్చును. కాని యట్లయిచోఁ బ్రతాపసింహుని కాలమున ననఁగా సం తకు (1788 నాఁటికి) అధమ పక్ష మిఱువదినాలు గేండ్లకు (1764 వకు) బూర్వమే రచింపబడియుండు ముద్దుపళని కృతిని గాదని, లేఖకుఁడు వేంకటస్వామి యీ రంగశాయి కొమార్త యెవర్తకో సముఖముకృతికిఁ బ్రతి వ్రాసి యీయవలసిన యగత్య మేమి? మీఁదుమిక్కిలి నాయఁడుసామియుఁ దంజావూరు కవియే యఁట. మఱి తల్లిపుట్టిక మేనమామ నెఱుఁగకుం డునా? కాఁబట్టి యీ కీలక 1728 యని నిశ్చయించుటయే సమంజసము. అది విజయరంగని రాజ్యపాలన కాలమునఁ బడి నది. అప్పటికప్పుడే సముఖముకృతి ప్రతిష్ఠ తంజావూరు నకును బ్రాకిన దన్నమాట దానికి రంగశాయికొమార్త తంజావూరు కవిచేఁ బ్రతివ్రాయించు కొనుటయే తార్కాణ. సముఖము రాధికాసాంత్వనము విజయరంగని పరిపాలన

కాలముననే రచింపఁబడె ననుట కందలి, 'ఇది శ్రీ పాండ్య మండలాధీశ్వర—శ్రీ విజయరంగ చొక్కనాథ మహీనాథ కరుణా కటాక్ష సంపాదిత...' అను నాశ్వాసాంత గద్యయే ప్రబలాధారము. అసలు సముఖము గ్రంథరచన మంతయు విజయరంగని రాజ్యకాలముననే సాగినది. అతని ప్రతి గ్రంథాంతగద్యలోను విజయరంగని పేరు కనిపించును. ఆ గద్యయు నన్నింట నొక్క తీరుగనే యున్నది.

ఇఁక నీ రాధికా సాంత్వనము సముఖము కృతమే యనుట కాధారములు: సముకాలికుఁడైన కవి యొకఁడు ప్రతి వ్రాయుట, గ్రంథావతారికలోని

> 'తెలయ వఖ్యాతిమిమ్మనుచు వేంకటకృష్ణ నృపాలశేఖరుం
> డిల రసికావతంసులకు హృద్యముగా మృదుమాధురీరసా
> కలిత చమత్క్రియాకలన కల్పనగా రచియింపనొప్పు ని
> శ్చలమగు రాధికారమణి సాంత్వనమున్ కృతి సల్పమం చనెన్.'

అను పద్యమును, అహల్యా సంక్రందనము నందును నిందును నచ్చముగా నొక్క తీరుగ నున్న గ్రంథాంత మందలి కృతిపతి (శ్రీరంగపతి) ప్రశంసా పద్యములుమూఁడు, నాగ్రంథమధ్యముననే నాయికా నాయకుల సమాగమ సందర్భమున నున్న పద్యములు మఱి మూఁడు నొక గద్యయును (చూ, రా. సాం. సంఖ్య వరుసగా 114 నుండి 120 వ పద్యము వఱకు)

ఏమైననేమి, ముద్దుపళని కృతి ముద్రితమై ప్రసిద్ధికెక్కినది. సముఖము కృతి ముందు పుట్టినను మూలఁబడినది. కాని యతని కవితా నవనీతాస్వాదన ఫలము మనకు ముద్రిత గ్రంథమునుండి మట్టనే మట్టినది. అయినను నీకృతిని బ్రచురింపవలసిన యావశ్యకతయుఁగలదు. నిలుకడ మీఁద నైనను నిజము తేలవలెను గదా! సముఖమువాని కృతిలో సరస ముగాఁ గనిపించిన ప్రతిపద్యమును సంగ్రహించినది ముద్దుపళని. అతని గ్రంథమున నున్న వే నూటయిఱువది గద్యపద్య

ములు. గద్యములు పోను నూటరెండు మాత్రమే పద్యములు. అందులో నలువది మక్కికి మక్కిగా గ్రహించినది. (ఆపద్యములన్నియు గ్రంథమున కనుబంధమైన అకారాది పద్యసూచికలోఁ జుక్కగుర్తులతోఁ జూపించి యుంటిని) ముఖ్యముగా ముద్దుపళని కృతి మూఁడవ యాశ్వాసమున నీ యుద్యమ మెక్కువ. అదియే కథయొక్క కండకట్టు—చిలుక రాయబారము, నాయికా నాయకుల విరహము, తత్సమాగమము—అంతేకాక పద్యపాద, పదబంధముల కూర్పును, భావముల మాఱుమనువులు నిట్టి యలఁతి యలఁతి మార్పులతో మఱికొన్నింటికి ఛాయలు గల్పించినది.

ఉదా :

1. కొసరుపల్కులఁ బన్ని గోటికత్తులఁ జిమ్మి
   కాసెలోఁ జెయివేసి కదియఁదీసి.
కన్గాతు లాగించి కౌఁగిట బిగియించి
   పరిచిత్తరుల నొత్తి పాగ నెత్తి
కల్లంబునకు వచ్చి కలికి యౌ నని మెచ్చి
   మెఱుఁగుఁజెక్కిలి గొట్టి కురుల పట్టి.
తొడకంబముల నాని తోఁపునూతులఁ బూని
   పందు సేసుక నొక్కి చాలఁ దక్కి
యదలుపులఁ బొగడికలు నెయ్యంపుఁ దిట్లు
గళరవంబులు దుడుకులఁ జెలఁగ నల్ల
మాధవుండును గడిదేటి మదనిసాము,
చేసి చెలరేఁగి నెఱహాయిఁ జెంది మఱియు-29. (సముఖముకృతి)

'అలమి కౌఁగిటఁగ్రుచ్చి యల్లందులకుఁ జొచ్చి
   కాసెలోఁ జెయి వేయు కౌశలంబు,
నునిక్కి పెందొడ లెత్తి రొమ్ములు ఝమ్మ్రవ హత్తి
   హిత వొప్ప నెదురొత్తు లిచ్చువైపు,
తడుసు లేఁ గవఁ దగ్గి తమి యుప్పతిల నొగ్గి
   ధేనుకబంధంబు వానుజాతి,
చిటచిటఁ జై నెక్కి రవళి హెచ్చఁగ నిక్కి
   పుంభావ మొనరింపఁ బూను సొగసు,

తరువుఁ జుట్టిన లతహూవ హారువు మీఁటి,
తనువు తనువునఁ బెనఁగొన వనువు చేరి,
వలపుతో నాగబంధంబు పలుపుదారి
రానికే కాని మఱిదేనికైనఁ గలదా-III 117 (ముద్దుపళనికృతి)

ఇట సందర్భము నాయికా నాయకుల సంభోగ సంరంభము, రతిబంధముల వర్ణన కొంత శాస్త్రప్రకారముగా చేసినది పళని. సముఖము వృత్తిచే దండనాథుఁడగుటచేఁ గాఁబోలు కర్ణాటు,కల్లము పరిబి త్తరమునను మల్లబంధ విశేషములనే సందర్భసుందరముగా ననుసంధించినాఁడిచ్చట. పళని పద్యములో. 'నల్లందులకు జొచ్చి' యను ప్రయోగము ససారస్యమే గాని యదియు నాయకు నుచ్ఛిష్టమే. (చూ. స. రా సా. 117).

2. 'కాంత లిట్టుల రా నీక అంతు నీయ
నీటిచిమ్ముల కళుకక నిలుచు గంధ
సింధురం బన నిలఁబడి శ్రీధరుండు
పలికె వారలఁ గని వయోధియమా అమర'-(106 స-రా॥ సా॥)
'చెలిచెలు లిట్లు చేరి...రవ్వలిడఁ గాఁగని శ్రీహరి యీ జైపోటుల
గలఁగని గంధసింధుర మనంగఁ దొలంగక నిల్చి యిట్లనున్.'
—(ము స-రా॥ సా॥ IV 16)

ఇందు ఛందస్సు మాఱినది గాని గంధ సింధుర మట్లనే యున్నది

3. సుదతి యిసుమంత కడకంటఁ జూచినంత
నింత అంకిలు సేతురా యింతులార
మీరు నా మాఱు పదముల మీఁద వ్రాలి
కలయఁ గలయించి సుకృతంబు గట్టుకొనరె స-రా॥ సా॥ 107
సుదతి యిసుమంత కడకంటఁ జూచినంత
నింత అంతులు చేతురా యింతులార
అలుక దీఱంగ దొరసాని కమరఁ బలికి
చెలిమి యొనరించి సుకృతంబుఁ జెందుఁ డనిన'
(ము-స- రా॥ సా॥ IV 17)

ఇందు పూర్వార్ధము లోకకే మోస్తరు. ఉత్తరార్ధమున నున్న సముఖ స్వారస్యము పళనిపద్యమునకు రాలేదు.

4. ఇందు బింబాస్య నవ్వుల కెంచి చూడఁ
   జంద్రకిరణవిలాసంబు సహజ మయ్యె.
   నింతిమనుగప్పకొప్పున కెంచి చూడఁ
   జంద్రకిరణ విలాసంబు సహజ మయ్యె—(స. రా॥ సా॥ 97)
   'ఇందుబింబాస్య చిఱునవ్వు కెంచి చూడఁ
   జంద్ర కిరణ విలాసంబు సహజ మయ్యె
   నింతిమనుగొప్పుకప్పున కెంచి చూడఁ
   గాలమేఘంబు సరిపాటి గాదనంగ- (ము-ప-రా॥ సా॥ III 153)

ఇట పళని పద్యమున నాలవ పాదము పూర్తిగా మాఱిపోయినది. ఆమెను సముఖము పద్యములోని సభంగ శ్లేష యర్థము కాలేదేమో! ముద్దుపళని గ్రంథము ముద్రిత ప్రతులు మఱి రెండిటఁ బై పద్యపు టుత్తరార్ధమునకు మాత్రము 'తీవబోడి కనుల తీ రెంచి చూచిన, జలజపత్రవితతి సమము గాదు' అను పాఠాంతరము గన్పించుచున్నది. కాని యది యొక దోపుకుపుల్ల. పద్యపూర్వార్ధము తేటగీతిలో నున్నది. పాఠాంతర మాటవెలఁది. కావున నది యపరిగ్రాహ్యము.

5. అపుడు వచ్చుట రాధ కంసారిరాక
   చిలుకచే విని తన వద్ది చెలులఁ బిలిచి
   వెన్నుఁ డిట కేఁగుదెంచిన విదుంబ వలదు
   వాకిటనె నిల్పుఁ డని చెప్పి పనిచె నంత—స. రా॥ సా॥ 101

   ఇటులఁ జనుదెంచు హరిరాక యొఱిఁగి చిలుక
   చెప్ప విని రాధ తన యొద్ది చెలులఁ బిలిచి
   శౌరి యిట వచ్చె నని వింటి సరగ వాని (మీరలకని-పా)
   విడక నిల్పుఁడు మోహిరాట మిడక యుంచె—

ము. ప- రా. పా. IV -5

6 ఇటుల నాడిన మాటల కిముడఁ బలికి
   రాజసము మీఱఁగా యదురాజమౌళి
   బలిమి జాలుముల సందడుల్ దొలఁగఁ ద్రోచి
   చొరవఁ జేసుక లోపలఁ జొచ్చు వేళ—స, రా॥ సా॥ 104.

అను గణీమణి వాక్యము లాలకించి
బలిమి జాలములు విలసిల్ల బలసి చోరవఁ
కేసి చూచెద వనుచు నా శ్రీధరుండు
శిఖి చెలగంగ లోఁజొచ్చి పోవఁ గాంచి — ము. ప. రా॥ సా॥
IV 13.

7. ఈ వైన మాకాఁటి కెటు పోయెనో యని
చెప్పి కరంబులు విప్పువారు — స. రా। సా॥ 109
ఈ బుద్ధి యూవాఁడె యెందుఁ బోయె నటంచు
విడనాడి చేతులు విచ్చి నొకతె — ము. ప. రా।సా॥IV 18

పై యుదాహరణములలో నాఁడాడ మాటలే మాఱినవి కాని భావముల బండారము బయటపడుచునే యున్నది. 'ఈవైనా'మిత్యాది స్థలములలో మూలగ్రంథపు సొగసులు కొన్ని ముద్దుపళని గ్రంథమునకు రాలేదు. ఇక్కడే మఱొక్క మాట; ఆమె వెలిదిండ్ల, శేషము వేంకటపతులను గూడ పలుకరింపక విడువ లేదు. (చల్లకు వచ్చి ముంత దాఁచ నేల యని కాఁబోలు). ఇఁక సముఖములో రాయబార మెందులకు! వెంకటకృష్ణప్పయుఁ గవిత్వమున శేషముతో వియ్య మందినవాఁడే. అసలు వారిరువురు నాప్తసఖులు (చూ. అహల్యాసంక్రందనము-అవతారిక). ఆ వియ్య మహల్యాసంక్రందనమున నెక్కువ. రాధికాసాంత్వనమున నొక్కపోకడ.

తడవుఁ జూచిన దృష్టి తాఁకునో యని వాని
నును మోముఁ గనులారఁగనఁగ నైతి
గబ్బి గుబ్బలు సోఁకెఁ గందునో యని వానిఁ
గలసి నా మనసారఁ గలయ నైతి — స రా॥ సా॥ 12
తడవు చూచిన దృష్టి తాఁకు నం చని వాని
సొగ సెల్లఁ దప్పక చూడ వెఱతు
మెఱిన గుబ్బ లదిమి గ్రుమ్మినఁ గందు నని వాని
లేఁత మేనును గౌఁగిలింప వెఱతు — తా. శ- IV - 42
(చూ. ము. ప - రా॥ సా॥ II—116 కూడ-తిమ్మన కృత్యను కృతులను గలవు. అవి స్థలాంతరమునఁ జూపఁబడినవి).

అన్నట్లు తాళ్ళపాక తిమ్మక్క వొకమూఁడు ముక్కలు వాఁడుకొన్నాఁ డని యీమధ్య నొక యమ్మక్కగారు చేమకూర నెత్తిపై నొక యభాండ మెత్తినారు; అది యొక మిషగాఁ బురుషకవుల నెల్లఁ దూర్పారఁబట్టినారు. మఱి దీని కేమందురో? దానిమాట కేమిగాని, సముఖము వాని కృతి నెంత యనుకరించినను ముద్దుపళని కృతికి దాని ప్రత్యేకత దానికున్నది. ఆమె తక్కువ తిన్న దామఱి? ప్రతాపసింహుని ప్రాపకమున శృంగారరసపు సరిహద్దులు చూచినది, కవితా భరత గంధర్వాది కళల కిటుకులు కనుఁగొన్నది. శతపద్యపరిమితమైన సముఖము కృతిని గ్రహించి, కించిదూనముగా నాఱువందల గ్రంథము ను దయారుచేసినది. తప్పక తదుపజ్ఞమైన గ్రంథమును రసికప్రశంసనీయమే. సముఖము గ్రంథములో నప్పుడే 'యిళ' సుద్దికొద్దిగాఁ బుట్టియున్నను నా ప్రతినాయిక పాత్రీకరణమునఁ జిత్రలేఖనపుఁ జమకుల నతిమాత్రమనోజ్ఞముగాఁ బ్రదర్శించినది పళని. సముఖముకంటె నెక్కువగా శృంగారరస రహస్యముల నూదంటు ససితనమునఁ దిమ్మనగారి యొరవడిని, పలుకుఁబళ్ళ మెలఁకువలలోఁ జేమకూర పాకమును సమర్థించినది. నాఁటికవుల కది యొక్క పరిపాటి.

సముఖము కృతి యేకాశ్వాస ప్రబంధము. కవి దీనినిఁ జాటు ప్రబంధమని పేర్కొనినాఁడు. గ్రంథాంతగద్యలో. పూర్వలాక్షణికు లుదాహరణ ముక్తకాది కావ్యభేదములనే కాని యిట్టినిబద్ధకావ్యములను జాటుప్రబంధములుగాఁ బేర్కొనలేదు. కాని చాటుశబ్దమునకుఁ బ్రియోక్తియను నర్థముండుటచేతనో, ప్రబంధప్రక్రియ కంగభూతములగు అష్టాదశవర్ణనలిందు పరిహరింపఁబడుటచేతనో, అపగతసర్గ ముప కావ్య మను నాలంకారిక వచనముండుటచేతనో రసికప్రియము, రసప్రధానము, నేకాశ్వాసము నగు నీప్రబంధము చాటుప్రబంధమైనది.

కవి దృష్టిలో. అంతకుముందు నాఁటి విజయరాఘవ నాయకాదులును దమ యక్షగాన నాటకములను జాటుకావ్యము లని పేర్కొనుటయు నట్టి దృష్టితోనే యనుకొందును. వెనుకటికి శ్రీ వేటూరి ప్రభాకరులు దీని నేకాశ్వాస క్షుద్రప్రబంధ మనిరి. కాని యందు నిరసన లేదనుకొందును. కావ్యాలంకారసంగ్రహకర్త చాటుప్రబంధముల నుదాహరించినచోట క్షుద్రప్రబంధము లను బర్యాయముగా వాడెను. క్షుద్రశబ్ద మిట నల్పార్థమునఁ బ్రయుక్తము. శృంగారము నరిగించుకోలేని వారి కెవరికో యనార్థకమున నిది క్షుద్రప్రబంధ మనిపింపవచ్చును. కాని దీనిని జాటుప్రబంధమనుటయే సమంజసము.

ఇందు సుప్రసిద్ధము సువిశాలము నైన రాధాకృష్ణుల ప్రణయైతిహాసమున నేకదేశమగు ఘట్టమును గ్రహించినాఁడు కవి- రాధ పరకీయగాఁ జెప్పఁబడకపోయినను అత్తవారి పేర్కొనఁబడినది. సత్యభామయే ప్రతినాయికయైనను నామె పాత్ర రూపుకట్టలేదు. ఆమె ప్రత్యేకతయు రాధికనే యాశ్రయించినది. ఆ సందర్భమునఁ దిమ్మనగారి పోకడలు బోలెడనుకరింపఁబడినవి.

ఉదా :—

1. 'అమ్మారయేమని చెప్పుదు — పారిజాత॥ I-75
   'తెలివా రేమని చెప్పుదు — రా॥ సా॥ 26
2. ఏమేమీ కలహాశనుండచటికై యేతెంచి
   యిట్లాడెనా - పారి॥ I-32
   'ఏమేమీ తెలిపింత లేకనె భళా హేమాంగి
   యిట్లాడెనా—రాధి॥ 33
3. 'మాసిన చీరఁగట్టుకొని ...' పారి॥ I-99
   'జడవేఁగ వదలించి...' రాధి॥ 77
4. తెడ తెడఁ గన్నుదోయిఁ గనువిచ్చు... పారి॥ I-101
   'ఈలపోను తెచ్చుకొప్పుఁగడు పెన్నెరమ... రాధి॥ 73,

ఇఁకఁ 'ఏకస్వరంబు'తో నేడ్చుట, "రాయను వింతపుట్టినదిరాయను" నిట్టివి సర్వప్రబంధసామాన్యము లైనవే యిందునుగలవు. రాధయుఁ "జిలువకోమలి"యైనది. సవతి "సరకాలఁ బెట్టి నేలరాయకున్నను నాపేరు రాధగాదు" అని ప్రతినఁ బట్టినది. అయినను ముక్కుతిమ్మన, ముద్దుపళనుల నాయికలవలె నాయకునిపై నెడమకాలి నెత్తలేదు. మఱియు గతానుగతికమగు ప్రబంధధోరణికి నీకావ్యమునకు నొక యంతరము గలదు. అవర్ణనల యవార్ణనాభస్వభావముగాని, యనుప్రాసల యట్టహాసములుగాని యిందులేవు. పురవర్ణనాదులులేవు సరికదా విరహవర్ణనల సందర్భమునను జంద్రోపాలంభాదులు పరిహరింపఁబడినవి. కాని, చేసినతప్పు చెప్పకతప్పదు, చేయరాని వర్ణనయొకటి చేసినాఁడు కవి, అదియు సుదీర్ఘముగా—రెండుసీసములు (98 & 99). అందు "శృంగార యౌవనశ్రీరాబ్ధినడుమను"అను పద్యము ముద్దుపళని గ్రంథముద్రిత ప్రతులలోఁ గొన్నిటనున్నది, కొన్నిటలేదు. రెండవపద్యమెందునులేదు. దీనినిఁబట్టిచూడఁగా, పళని యాపద్యములఁ బరిహరించెననియే తోఁచుచున్నది. అది యథార్థమేయైనచో, గ్రుడ్డిలో మెల్ల, ఆమె యుచితజ్ఞత కది కొంత యూపిరి. అసలు విజయనగర ప్రబంధములందు విప్రలంభశృంగారము, దక్షిణాంధ్రప్రబంధములందు సంభోగశృంగారమును ప్రాచుర్యము వహించినవి. అది యుగధర్మము.

సముఖము దిజాతీయమై నుడిగారపు నునుపు దేఱిన రచన. అతని పలుకుఁబళ్లకుఁ గొన్నిమచ్చులు.

కనులఁ గప్పుక (23); దొంతర ముద్దులు (30), దురుసు పైసరములు (30), మానినినిఁ జేసినందుకు (41), సంగవాచి (45), దుదారిక

పిల్లి (45), పాల మెఱుఁగని నిమ్మటిపళిక పసుపు (49,) తమ్ముం దన మట్టు సెఱుఁగు (54), వమ్మిశాపఁ బోసికొనిరా (59), పదింబదియు గాను (60), తప్పతంటలకు (62), వలపు వడ్డికిఁ బాఱిన (114).

సామెతలు :—నిన్నఁగుప్పయు నేఁడాళ్లు (36), వేలు వాచిన లోలంత పెరఁగ వనిన, లోలువాచిన వది యొంతపోలు (39), అల్పునకుఁ గల్మివచ్చిన నర్ధరాత్రి, గొడుగు తెమ్మన్న కత గాను (52) కట్టదేలుఁ, కట్ట మన్నఁ గుమ్మర బూది (62), తిరిపెం బెత్తేవానికిఁ బెరుగుంగూడేమి ప్రాఁతి (64). ఎల్లవారికి శకునంబు తెలుఁగఁ బల్కి, బల్లి తాఁబోయి తొట్టిలోఁబడినరీతి (72). తగిలెనా తగిలెను, తప్పెనా తప్పెను, నాతి శెట్టివాని చేతిడాయి (59).

ఇట్టివింకనుగలవు. సాభిప్రాయములైన ప్రయోగములు నొకకొన్ని కలవు.

ఉదా :— 1. శ్రీకృష్ణునిఁ దోడితెమ్మని రాధ పంపిన చిలుక పుల్లయ వేసువరము చేసికొనివచ్చినది. తదుపమానము:—

'పాదు పడుటి కంటె మంటల నంట బెదరి
తుల్లి రొతును బడవైచి వెళ్లివచ్చు
తీయువిలుకాని సాంబ్రాణి తేజ' (19).

2. కృష్ణుఁడు రాఁడు; రాధకుఁగూరిమిపోదు. 'అత్తకోక తొలఁగినటు' లున్నదఁట యీసందర్భము. అత్త సరుదు కోదు; సరుదుకొమ్మని యల్లుఁడు చెప్పలేఁడు (46) (ద్రావిడ భాషలో 'అత్తగారికచ్చ' యనునర్థముగల లోకోక్తి కలదఁట).

3. రాధాపదాక్రాంతుఁడైన కృష్ణు నామె యదొక గమ్మత్తుగా లేవనెత్తిపడట ఆ 'మెత్తినపట్టుపీడక' లేచినాఁడఁట యీ రసజగత్సామ్రాట్టు (116.

ఇట్టి ప్రయోగవైచిత్రి సముఖమునకే చెల్లినది. ఆస్వా రస్యరహస్యాభిజ్ఞత ముద్దుపళనికే చెల్లినది. సముఖము ప్రయో

గములలో నింకొక విలక్షణతయుఁ గలదు. గుట్టుబోయియ్యాని, చూచేరు, మోవాని (మోవి+అని), నడిచే, నవ్వేటి, చేసుక, వద్ది మొదలగునవి. ఆప్రయోగము లాయుగసహజములు. 'అచ్యుత' శబ్ద మొకటి సాధిసఘటితముగా నిందుఁ గన్పట్టుచున్నది. అదియు నాఁటి యపహాసవిస్మృతివిశిష్టతలలో నొకటి(చూ విజయరాఘవుని రఘునాథ నాయకాభ్యుదయము'. ఆకవులకు వ్యాకరణము రాదనికాదు, వారు మహాకవులనికాదు, కాని వారికావ్యములం దప్రయత్నముగనో, యభినివేశపూర్వకముగనో దొరలిన వా ప్రయోగములు. అంతే; అదియొక విలక్షణత! సముఖము ప్రయోగములు రసాపకర్షకములు కాలేదనియే చెప్పవచ్చును.

రసికశేఖరుఁడగు విజయరంగచొక్కలుని దక్షిణాంధ్రయుగ శ్రీనాథుఁడగు శేషము వేంకటపతి స్నేహము, తిమ్మనగారి యొరవడి, చేమకూర పలుకుఁబడి సముఖము నొక సరసకవిగాఁజేసినవి. రాధికాసాంత్వనము, అహల్యాసంక్రందనము మనకు దక్కినవి. ఉభయత్ర భావబాంధవ మున్నను శైలీభేదము గన్పట్టుచున్నది. మొదటిదానిలోఁ దెలుఁగుపోలుపును, రెండవ దానిలో సంస్కృతప్రౌఢియు నెక్కువ. అహల్యాసంక్రందనమే యతని కవిప్రతిభకు మూలకందమైనను దాని కీలక మీ చిన్ని కృతి యైన రాధికాసాంత్వనమే.

ఆంధ్రవిశ్వకళాపరిషత్ -
పరిశోధనశాఖ, వాల్తేరు.
1-అక్టోబరు, 1953

యస్వీ జోగారావు
(బి. యే. ఆనర్సు).

గ్రంథప్రచురణ.

ఈప్రచురణకు మూలము : ఆంధ్రసాహిత్యపరిషత్తులోని సం. 177 రు గల తాళపత్త్రప్రతి. లేఖకుఁడు తంజాపూరికవి వేంకటస్వామి నాయకుఁడు. అతఁడు వ్రాసినది కీలక మార్గశీర్షమున. ప్రతిస్థితియు, లేఖనవైఖరియు బాగుగనే యున్నవి. కాని వ్రాఁత తప్పులు లేకపోలేదు. అవి యీ దిగువ నుదాహరింపఁబడిన ముద్దుపళని ముద్రితప్రతులను సంప్రతించి సవరించితిని.

1. తిరుక్కుడియూరు కృష్ణరావుగారిచే—
   శ్రీధామ ముద్రాక్షరశాల ప్రచురణ— (1887 క్రీ. శ.)
2. ఎద్దనపూడి చెంచురామయ్యగారిచే—
   శ్రీ పారిజాత ముద్రాక్షరశాల మదరాసు (1908)
3. కె. జి. మూర్తి, శృంగార గ్రంథమండలి,
   మచిలీ పట్టణము— [1936]
4. శ్రీ సత్యనారాయణ పబ్లిషింగ్ హౌస్,
   రాజమండ్రి — [?]
5. వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
   మదరాసు — (1950)

పై వానిలో 1,2 ప్రతులొక్కమాదిరిగను, 3,4 ప్రతులొక్కమాదిరిగను నున్నవి. ముద్రితప్రతులలో నపపాఠము లున్నచోట్ల మూలప్రతిపాఠములే స్వీకరింపఁబడినవి. ముద్రిత ప్రతుల కతీత మైన చోట్ల నున్న లేఖకప్రమాదము లర్థానుగుణముగా సరిచేయఁబడినవి. పాఠాంతరములు పుటల కడుగునఁ జుక్కగుర్తులతోడను జూపఁబడినవి, గ్రంథపాతములు ముద్రితప్రతుల సాహాయ్యమునఁ గుండలీకరణములలోఁ బూరింపఁబడినవి.

చెన్నపుర ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున నం R. 28 రు గల తాళపత్త్రప్రతి యొకటి కలదు. అదియు సముఖము రాధికాసాంత్వనమే. కాని యందలి వ్రాఁత యొక తీరు, తప్పులున్నవి, శైథిల్యము గలదు, గ్రంథపాతములు నెడ నెడఁ గలవు. అచ్చటనే నం 199 రు కాగితపుఁ బ్రతియు నొక్కటి కలదు; కాని దాని మాతృక పై శిథిలతాళపత్త్రప్రతియే. ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రతియే మేల్తరమైనది.

నాకీ గ్రంథ పరిష్కరణోద్యమమునఁ దోడ్పడిన యాంధ్రసాహిత్యపరిషత్కార్యదర్శి శ్రీ చతుర్వేదుల సత్యనారాయణ శాస్త్రిగారికిని, మేనేజరు శ్రీ వద్దిపర్తి చలపతిరావు గారికిని, దక్షిణ పారిషదులకును కృతజ్ఞుఁడను.

అభినవముగ నాంధ్రరాష్ట్రప్రభుత్వశుభోదయమైనది. ఇఁకనైన నిట్టి యమూల్య గ్రంథజాలము నాంధ్రప్రజ కందిచ్చు పరిషత్తువారి పూనిక నగ్గించి, ధనాభావముచే వెనుకపడియున్న పరిషత్తునకు శుభాక్షతలుగా విరాళముల నిచ్చి ప్రోత్సహించి, తద్గ్రంథభాండాగారమునఁ దాళపత్త్రతనుకార్శ్యముతో నసూర్యంపశ్యలై పడియున్న కావ్యసుందరులను జూచుట కాంధ్రసాహిత్యసత్యవ్రతులు నోఁచుకొందురుగాక.

'యస్వీ'

రాధికాసాంత్వనము

సముఖము వేంకట కృష్ణప్పనాయకుడు.

క. శ్రీ రాధామణిలోలా
ధారాధరనీలనీల దైత్యవిఫాలా
వారిధిశయన సుశీలా
శ్రీ రాజదుకోవిశాల శ్రీ గోపాలా. 1

చ. వెలయు నభీష్ట మి మ్మనుచు
వేంకటకృష్ణనృపాలశేఖరుం
డిల రసికావతంసులకు
హృద్యముగా మృదుమాధురీరసా
కలితచమత్క్రియాకలన
గల్పనగా రచియింప నొప్పు ని
శ్చలమగు రాధికారమణి
సాంత్వనముం గృతి నల్పుమం చనెన్. 2

గీ. అవధరింపుము స్వామి దివ్యగుణభూమి
యని పరీక్షిన్మహారాజుఁ గని శుకుండు
వినయసంభ్రమభయభక్తు లినుమడింప
నవలి వృత్తాంత మి ట్లని యానతిచ్చె. 3

క. ఇంపై వనరుహజావా
సంబై ద్విజరాజవైశ్యజననివహంబై
డంబై తగు బహుబలసే
వ్యంబై ద్వారకపురంబు హరిధామంబై. 4

గీ. అచట నెప్పుడుఁ గాపుర మై వసించు
దేవదేవుండు శ్రీకృష్ణదేవుఁ డగుచు
రాధికాసత్యభామలు రాజసమునఁ
బ్రేమఁ గొలువంగ జగదభిరాముఁ డగుచు. 5

గీ. ఇట్టు లుండంగ నత్తవా రేగుదెంచి
దేవకీతనయు సత్యను భావ మలరఁ
దోడుకొని పోవ వారలఁ దోలివఁ బనిచి
రాధ తన కేళికామందిరమ్ముఁ జేరి. 6

వ. చిలుకం గని

క. అచ్చట నడిచే వింతలు
ముచ్చట లెల్లయును దెలిసి ముద్దులు గులుకన్
అచ్చుతుని దోడి తెమ్మని
య చ్చిలుకను బనిచి రాధ యలమటపడఁగన్. 8

చ. చిలుక వజీరుఁ డత్తఱిసి
జిందఱి వందఱి సేతు సంచు నా
చిలుకలకొల్కిపై, గదిసి
చివ్వల రవ్వ లిడంగ జాతిపెం
♦జిలుకులకోరికోల లటు
చెండెను దుమ్మెదనారి మోలియఁగాఁ
గలికి మెఱుంగుగుబ్బలను
ఖంగు ఖణీలు ఖచిక్కు రింగనన్. 9

క. ఇ ట్లేసిన మది ఝల్లనఁ
బ ల్లెల్లను సడలి రాధ భయ మందుచుఁ దా
నిట్లని పలుకఁదొడంగెన్
♦బొట్లంబై చుట్టునుండు పోఁతులతోడన్. 10

♦ చిలుకులకోరి } దుష్కంటక శరము
చిలుకటమ్ము } చిలుకము   ఆంధ్రవాచస్పత్యము

♦ పొట్లము = గుంపు   శబ్దరత్నాకరము

ఉ. శౌరిని బిల్వఁగాఁ జనిన
చక్కని కీర మ దేల రాదొ, యే
దారిని జన్నదో నడుమఁ
దాతనొ చేరెనొ లేదొ గోపికా
జారునిఁ గానదో కనెనొ
చక్కగ నా వెత విన్నవించెనో
సారెకు; లేక శౌరినుడి
చక్కెరయుక్కఱ మెక్కి చొక్కెనో. 11

సీ. తడవు చూచిన దృష్టి దాకునో యని వాని
నునుమోము కనులారఁ గనఁగనైతి
గబ్బి గుబ్బలు సోఁకఁ గందునో యని వానిఁ
గదిసి నా మనసారఁ గలియనైతిఁ
(గదియ నొక్కిన నేడఁ గందునో యని వాని
యధరంబుఁ దనివార నానవైతిఁ)
(దడవు చేసిన మేను బడలునో యని వానిఁ
జెలఁగి నా మనసారఁ గలియనైతి)
గీ. నొచ్చు నం చని చెక్కిలి నొక్క నైతి
నలుగు నని మేను గౌఁగిట నలమ నైతి
నందసుతు ప్రేమ సత మని నమ్మి యుంటి
నిప్పు డీ రీతి నడచు నం చెన్న నైతి. 12

సీ. తాను నా మో వాని తనమోవి బదు లిచ్చి
తెఱవ నీదు ఋణంబు దీఱె నను
నేను బైకొనఁ గాన తాను బైకొని యేలి
యింతి యీడుకు నీడు నిదిగొ నను
నేను ము ద్దిడఁగాన తాను ము ద్దిడికొని
మదిరాక్షి బదులుకు బదు లి దనును
నేను జెక్కిలి నొక్కఁ దాను జెక్కిలి నొక్కి
చెలియ మేలుకు మేలు చేసి తనను

గీ. గడియ గడియకు నొక వింత గడనసేయు
వేళ వేళకు నొక్కొక్క లీల నుండుఁ
చార మెఱుఁగని ముద్దుల శౌరిచిన్న
లెన్ని యెన్నని తలపోతు నెట్లు సైతు. 13

క. ఆ మాలిమి యా లాలిమి
యా మేలిమి యా వినోద మా గళరవముల్
ఆ మాటలు నా సీటులు
నా మీటులు నాటపాట లతసికె చెల్లున్. 14

సీ. మదహస్తిపై నెక్కి; మావటీ ల్గాలువంక
విచ్చలవిడిఁ జొచ్చి వచ్చునటుల
సాంబ్రాణి తేజిపై; సాహిణీ ల్వ్రాగడంగఁ
బట్టాను జేపట్టి వచ్చునటుల
వే టందలమ్మున[1]; విచ్చుకత్తులవారు
మెచ్చఁగా దులదుల వచ్చునటుల
గిలుకుపావలు మెట్టి; చెలికాఁడు వెఁటరాఁ
బావురంబును బూని వచ్చునటుల

గీ. పడతు లిరువంకఁ దెలనాకుమడుపు లీయఁ
గొనుచుఁ బెండెము ఘలుఘల్లు రనఁగ నాదు
పడుకటిలు సేరఁగా శౌరి వచ్చుదారి
తోఁచునే గాని మఱియేమి తోఁచలేదు. 15

సీ. కురు లంటఁగా రాకు గట్టు బొయ్యా ననఁ
జీకాకుగాఁ దీసి చిక్కువఱచుఁ
గెమ్మోవి నొక్కకు గేలిసేయుదు రనఁ
గసిమీఱఁ బలుమొనగంటు సేయు

---

1. వేటందలమ్మున—అని. తా. ప. ప్ర.

వలుదగుబ్బలు ముట్టవలదు నవ్వే రనఁ
గ్రొత్త నెత్తురు గ్రమ్మ గోరు లుంచు
నరగఁ బో వలె నింకఁ బరులు చూచెద రన
జాముల తరబళ్లు జాగు సేయుఁ

గీ. బలుకవ ద్దనఁ బావురా పలుకు పలుకు
నత్త నే గాన యనఁ బ్రీతి హత్తె నను
అట్టి నా ప్రాణవిభుఁ బాసి యకట మేను
జీవములు పోక యల్లాడె సిగ్గు లేక. 16

సీ. విభునిఁ బాసితి నంచు విని సంతసం బందు
తోయజాక్షులఱొమ్ము ద్రొక్కు నటుల
హేమిక స్రుక్కెనా యనుచుఁ దలాడించు
మించుఁబోణుల తల ల్మెట్టి నటుల
హరి రాధ నేలుట యది యొక కథ యను
కొమ్మలనాలిక ల్గోసి నటుల
కరఁగు న న్గను గొని కనుఁగీఁటి నవ్వేటి
మోహనాంగుల కన్నుఁ బొడిచి నటుల

గీ. మాధవుని జేరి సామి ర మ్మనుచుఁ జీరి
గెలివి యొనగూర్చి నిండుఁ గౌఁగిటను జేర్చి
దయలు దయివాఱ యెడత్రేని తావ మాఱ
మేలిమిని గూడఁ గలదె యీ మేనితోడ. 17

వ. అని యిటుల జవరాలు విరాళిం జెందు సమయంబున. 18

గీ. హరునుదుటి కంటిమంటల నంటి బెదరి
త్రుళ్లి రాతును బడవైచి వెల్లివచ్చు
తియ్యవిలుకాని సాంబ్రాణి తేజి యనఁగ
గగనమార్గంబునను దోఁచెఁ గలికిచిలుక 1

క. ఇటు లేతెంచిన చిలుకం
గుటిలాలక లేచి చూచి కులుకుచుఁ జిలుకా
యిటు రమ్ము ర మ్మటం చన
దిటవున ముంజేత వ్రాలె దీనత దోఁపన్. 20

గీ. అటులు ముంజేతిపై వ్రాలినట్టి ముద్దుఁ
జిలుక నటుదువ్వి చిలుకలకొలికి పలికె
మోవి గంపింప ముక్కుటముత్తె మదరఁ
గప్పురావియు గుప్పునఁ గప్పుకొనఁగ. 21

ఉ. దేవకిచిన్నికుఱ్ఱ వసు
దేవునికూన యశోదపట్టి నా
దేవుఁడు నందుకందు బల
దేవుని తమ్ముఁడు గోపగోపికా
జీవనజీవనంబు యదు
సింహము శౌరి కిరీటిబావ శ్రీ
దేవియనుంగుజోడు వన
తి వ్యసియింపఁగఁ గంటె కీరమా. 22

సీ. చుఱుకు చూచినఁ గందు సుకుమారు నెమ్మేను
విరహాజ్వరంబున సొరుగకుండ
నిట్టూర్పు లోర్వని నీలవర్ణునిపై న
సోమరివలిగాలి సోఁకకుండఁ
జనుములుల్కా లాగని శౌరివక్షంబున
విరిశరంబులు చాల నొరయకుండ
మణితము ల్వినలేని మాధవు వీనుల
స్మరచాపటంకృతు ల్నరయకుండ
గీ. వెన్నఁ డిటువంటి కడగండ్ల నెఱుఁగనట్టి
విభుఁడు వెన్నెలచిచ్చులో వేఁగకుండ
కనులఁ గప్పుక నాసామి మన సెఱింగి
సరసు నెనయుమె కీరమా సత్యభామ. 23

గీ. ఎంత వేడిన బదు లాడ వేమి చిలుక
కాలగతు లెట్టు లున్నవో గడచినాము
కాఁగలవి కాక మానవు గాక తెలుపు
చల్ల గొన వచ్చి ముంత దాఁచంగ నేల. 24

వ. అనిన విని చిలుక యిట్లనియె. 25

క. తెలిపెద నేమని చెప్పుదు
హరి యున్న గృహంబుఁ జేరి యటు చూతుఁ గదా
సురతోద్యుక్తుల సత్యా
మురహరులం జూచి ఖేదమోదములయ్యెన్. 26

వ. అది యెట్లంటి వనిన. 27

సీ. పన్నీటి మేరువుల్ బాగాలతట్టలు
కలపంపుగిన్నెలు గందవొళ్లు
ముడిపూల పొట్లముల్ పునుఁగుఁగరాటముల్
జవ్వాజిగిండ్లు ద్రాక్షారసంబు
అద్దముల్ సొమ్ములు సత్తరుచెంబులు
కుంకుమపింగాండ్లు గుసుమతలతలు
కపురంపుఁ గ్రోవులు గస్తూరిబీణియల్
గట్టువర్గంబులుఁ జుట్టుదనరఁ

గీ. జలువచప్పరకోళ్ల మంచమ్ములోనఁ
జెంపబిల్లలుఁ దలగడల్ చెలఁగుదిండ్లు
జలువు లొరుగులు గల పూలపాన్పుమీఁదఁ
దమకమున సత్య హరియును దగఁబెనంగి. 28

సీ. కొనరుపల్కులఁ బమ్మి గోటికత్తులఁ జిమ్మి
కాసెలోఁ జెయి వేసి కదియఁదీసి
కర్జాతు[1] లాగించి కౌఁగిట బిగియించి
సరిబిత్తరుల నొత్తి సాగనెత్తి

---

1. కర్జాతు=కన్నాత. మల్లయుద్ధములో నొక విన్నాణము—శుద్ధాంధ్రపద పారిజాతము, లక్ష్మీనారాయణ నిఘంటువు.

కల్లంబు[2]నకు వచ్చి కలికి యూ నని మెచ్చి
మెఱుగుఁజెక్కిలి గొట్టి కురులు పట్టి
తొడగంబముల నాని తోపునూకులఁ బూని
యందు చేసుక నొక్కి చాల దక్కి
గీ. యదలుపులుఁ బొగడికలును నెయ్యంపుఁ దిట్లు
గళరవంబులు దుడుకులుఁ జెలఁగఁ సత్య
మాధవుండును గడిదేఱి మరునిసాము
చేసి చెలరేగి నెఱిహాయిఁ జెంది మఱియు. 29

సీ. కిలకిలనవ్వులు గిలిగింతలును బంధ
భేదపు రవములు వింతవగలు
పావురాపలుకులు వాతెఱనొక్కులు
చిగురుమకారముల్ జిలుఁగుఁదిట్లు
దురుసు పైసరములు దొంతరముద్దులు
బిగికౌఁగిలింతలు బేరజములు
కొనగోటిమీఁటులు గోరింపులుబుకులు
కొనరుఁగనొబ్బమముల్లు కులుచసన్న
గీ. తార నేబాసు మేలు చల్లారె బాప
అహహ తడబడ కెడ మీకు నాయె నాయె
విడకు విడువకు నడు మని నుడువు లపుడు
చెల్లఁబో యేమి చెప్పవచ్చుఁ గొల్లకొల్ల. 30

క. నానా విభవాకరమై
మానసంజాతజాతమహిమార్ణవమై
కైనికతరమై[1] యాసుఖ
మానంద బ్రహ్మమైన హరి యేమఱచె. 31

---

2. కల్లము —— మల్లబంధవిశేషము (శ. ర).

1. కానికతరమై-తా.ప.ప్రి.ము. ప్ర. కాని యామాట కర్థము లేదు. కైనికతరమై అని సవరణ. 'కీవము' మాహాత్మ్యము. కైచిత్ర్యము, ఆనందము, సంతోషము సంస్కృతశబ్దార్థ కల్పతరువు.

రాధికా సాంత్వనము

అకారాది పద్యసూచిక.

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు

శ్రీ పిఠాపురము మహారాజావారి ధనసహాయముచే రచియింపఁబడుచున్న పెద్దనిఘంటువులోని రాయల్ సైజు 1000 పుటలుగల ప్రథమ సంపుటమును, 955 పుటలుగల రెండవ సంపుటమును, 980 పుటలుగల మూఁడవ సంపుటమును, 950 పుటలుగల చతుర్థసంపుటమును, ముద్రితములై విక్రయమునకు సిద్ధముగానున్నవి. ఇందు ప్రథమసంపుటమున అకారము మొదలు, ఔకారము వఱకునుగల యచ్చులాదియందుఁగల సంస్కృతాంధ్ర శబ్దములన్నియుఁ గలవు. రెండవ సంపుటమున 'క' మొదలు 'జ' వఱకుఁగల శబ్దములును, తృతీయసంపుటమున 'చ' మొదలు 'తృ' వఱకుఁగల శబ్దములును, చతుర్థసంపుటమున 'తె' 'న' వఱకుఁగల శబ్దములును గలవు. ఇదివఱకున్న నిఘంటువు లన్నిటికంటె నిది సర్వవిధముల నుత్తమ మయినది. ఈపుస్తకమును రచియించుటకు ముద్రించుటకు విశేషద్రవ్యము పట్టినను ధనవంతులకేగాక జనసామాన్యమునకుఁ గూడ లభ్యముగా నుండవలయు నను తలంపులో నీ క్రిందివెల నిర్ణయింపఁబడినది,

క్యాలికో బైండింగు ఒక్కొక్క వాల్యూము రూ 6 లు,

పరిషత్ప్రచురణలు

1.	ఆధునికాంధ్ర వాఙ్మయవికాసవైఖరి జయంతి రామయ్యపంతులుగారు ,,	...	1-8-0
2.	కాళిందీ కన్యాపరిణయము-అహోబలపతి ప్రథమ ద్వితీయభాగములు	...	1-8-0
3.	చంద్రభానుచరిత్రము- తరిగొప్పుల మల్లనకవి		1-0-0.
4.	పరిషత్పుస్తక భాండాగారము		1-0-0
5.	మన్నారు దాసవిలాసనాటకము - రంగాజమ్మ		0-12-0
6.	రసార్ణవాలంకారము - ప్రకాశవర్షకవి	...	0-8-0
7.	రఘునాథరామాయణము (ప్రథమభాగము) రఘునాథభూపాలుఁడు	...	0-12-0
8.	రాయవాచకము - విశ్వనాథనాయని స్థానపతి	...	1- 0-0